Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 22.06.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 03 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## ముందస్తుకు..
# ముహూర్తం?

> వన్ నేషన్ - వన్ ఎలక్షన్‌కు రంగం సిద్ధం
> ఈ ఏడాది ఆఖరులోనే ఎన్నికల సమరం
> పావులు కదుపుతున్న బిజెపి అదిష్ఠానం
> ఏ.పి, తెలంగాణాలకు కలిపే ఎన్నికలు



**ముందస్తు ఎన్నికలు... తాజా జాతీయ రాజకీయాలలో ఇప్పుడిదొక చర్చ. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ ఏడాది ఆఖరులోనే లోక్‌సభకు ముందస్తు ఎన్నికలకు పోనుందన్న సంకేతాలు అందుతున్నాయి. నిన్న జమ్మూ-కాశ్మీర్‌లో పీడీపీతో బీజేపీ తెగదెంపులు చేసుకోవడం కూడా ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. ముందస్తు ఎన్నికలకు, జమ్మూకాశ్మీర్‌లో పిడిపితో సంబంధాలు తెంపుకోవడానికి సంబంధమేంటనే సందేహం కూడా రావచ్చు. జమ్మూకాశ్మీర్‌లో ప్రస్తుతం గవర్నర్ పాలన విధించారు. ఆ రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలతో పాటే అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేసి అక్కడ సొంతంగా అధికారంలోకి రావాలన్న ఆలోచన కూడా బీజేపీ నేతలు వున్నట్లు తెలుస్తోంది.**

గత కొంత కాలంగా ఎన్డీఏ ప్రభుత్వం 'వన్ నేషన్ – వన్ ఎలక్షన్' అనే నినాదాన్ని వినిపిస్తోంది. అయితే దేశంలో 29 రాష్ట్రాలున్నాయి. వాటి ఎలక్షన్‌లు వివిధ కాలాలలో జరుగుతుంటాయి. లోక్‌సభ ఎన్నికలు జరిగే కాలానికి, ఆయా రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలు జరిగే కాలానికి అసలు పొంతన వుండదు. ఇలా జరగాలంటే చాలా రాష్ట్రాలలో ప్రభుత్వాలను గడువుకంటే ముందే రద్దు చేయాలి. మరికొన్ని రాష్ట్రాలలో గడువు పొడిగించాలి. ఇది కష్టసాధ్యమైన పనే! అదీగాక కొన్ని రాష్ట్రాలలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడి మధ్యలోనే అవి కుప్పకూలే పరిస్థితులుంటాయి. అలాంటప్పుడు ఆ రాష్ట్రాలలో మధ్యంతర ఎన్నికలు పెడతారా? ఒకవేళ పెట్టిన తర్వాత ప్రభుత్వం ఐదేళ్ళు వుండాల్సి వస్తే, మళ్ళీ లోక్‌సభ ఎన్నికల నాటికి ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే పరిస్థితి ఉండదు కదా? కాబట్టి 'వన్ నేషన్ – వన్ ఎలక్షన్' అన్నది ఒకేసారి రూపుదాల్చడం కష్టం. అయినా పాక్షికంగా దీనిని (మిగతా 11వ పేజీలో)

## వీళ్ళిద్దరూ.. ఎవర్ని ముంచుతారో?



**రాష్ట్ర రాజకీయాలలో అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైసిపి విషయాలలో క్లారిటీ వుంది. 2014లోనే కాదు వచ్చే ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీల మధ్యే ప్రధాన పోటీ వుంటుంది. ఈ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు ఎలాగూ ఓట్లేయరు, కాబట్టి అవి డమ్మీలే! ఇవి పోటీలో వున్నా వచ్చేది నామమాత్రపు ఓట్లే!**


అదికాకుండా ఇప్పుడు జనాలకు అర్థం కాని పజిల్ పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్, మాజీ సిబిఐ జేడీ లక్ష్మీనారాయణ. వీళ్ళిద్దరూ రాష్ట్రంలో తిరుగుతున్నారు. పవన్‌కళ్యాణ్ జనసేన జెండా పట్టుకుని ప్రత్యక్షంగానే రాజకీయ యాత్రలు చేస్తున్నాడు. లక్ష్మీనారాయణే ఇంకా ఏ జెండా పట్టుకోలేదు. అతని అజెండా ఏంటో కూడా తెలియడం లేదు. కాని వచ్చే ఎన్నికల్లో (మిగతా 11వ పేజీలో)

## • ఆదర్శనేత
# డేగా కన్నుమూత



11లో



## పచ్చ మీడియా రచ్చతో...
# బాబుకు మచ్చ
### 'దేశం' పరువు తీస్తున్న భజనపరులు

ఇది అందరికీ తెలిసిన కథే... కాని, అన్ని తరాలవాళ్ళు తెలుసుకోవాల్సిన కథ... అనగనగా ఒక కొడుకు... ఒకరోజు వేరే వాళ్ళ పొలంలోకి వెళ్ళి తోటకూర దొంగతనం చేసి ఇంటికి తీసుకొచ్చాడు. దొంగతనం తప్పని చెప్పాల్సిన తల్లి, కొడుకు తెచ్చిన తోటకూర చూసి మురిసిపోయింది. కొడుకును భలే పని చేసావంటూ పొగిడింది. దాంతో ఆ కొడుకు ఈసారి వంకాయలు దొంగలించి తెచ్చాడు. తల్లి మళ్ళీ అభినందించింది. కొడుకు ఎనలేని ఉత్సాహంతో దొంగతనాల స్థాయిని పెంచాడు. దారి దోపిడీలు, చైన్ స్నాచింగ్‌లు చేస్తూ పోలీసులకు దొరికిపోయాడు. కోర్టులో అతను చేసిన దొంగతనాలు నిరూపించబడి (మిగతా 11వ పేజీలో)

# గుంతలా!.. మృత్యు గుహాలా!..




**జిల్లాలోని చెరువులు దొరువుల్లో, నీటి గుంతల్లో మృత్యువు పొంచివుంటోంది. ఆ మృత్యువు ఎప్పుడు ఎవరిని కాటేస్తుందో తెలియడం లేదు. ఇటీవల సెలవుల్లో సరదాగా ఈతకు దిగిన పలువురు చిన్నారులను, యువకులను మృత్యువు పొట్టనబెట్టుకుంది. చెరువుల్లో ఎక్కడంటే అక్కడ నిబంధనలకు విరుద్ధంగా గుంతలు తవ్వేస్తుండడంతో అవి మృత్యువుకు ఆవాసాలవుతున్నాయి. అయినా, అధికారయంత్రాంగం పట్టించుకోకపోవడమే విచారకరం.**

- చెరువులు.. దొరువుల్లో పొంచి ఉన్న ముప్పు
- రెండు నెలల్లో ఏడుగురు బలి
- పట్టించుకోని అధికారయంత్రాంగం

జిల్లాలో చెరువులు దొరువులు ఇప్పుడు మృత్యువుకు నివాసాలవుతున్నాయి. అక్కడే పొంచివుండి ఎవరు సరదాగా ఈతకు దిగినా వారిని కబళిస్తోంది. దీనికి తోడు, మట్టి కోసమో, ఇసుక కోసమో పెద్దపెద్ద యంత్రాలతో కొంతమంది ఇష్టంవచ్చినట్లు గుంతలు తవ్వేస్తుండడం, ఆ తర్వాత చెరువులకు నీళ్ళొచ్చినప్పుడు, ఉత్సాహంతో ఈతకు దిగినవారు అక్కడ గుంతలున్నాయని తెలియక ఆ గుంతల్లో మునిగి చనిపోవడం తరచూ జరుగుతోంది. సరదా కోసం ఈతకు దిగితే చివరకు చావే ఎదురవుతోంది. గుంతలు తవ్విన ప్రాంతాల్లో ఆ తర్వాత ఎలాంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు పెట్టడం వంటి పనులు ఖచ్చితంగా చేయాలని గతంలో జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించివున్నా, ఆచరణకు మాత్రం రావడం లేదు. దీంతో, ఎవరిష్టం వారిదైపోయిందని, ఎవరు ఎక్కడ మునిగి చనిపోతున్నా ఎవరికీ పట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

## సరదాగా ఈతకు దిగితే..ఇక అంతే!

ఈ వేసవి సెలవుల్లో సాధారణంగా చిన్నారులు, యువకులు ఈత కోసం సరదాగా దిగితే..ఇక ఏమవుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఆ సరదాయే చివరికి ప్రాణాలమీదికి తెస్తోంది. ఈ రెండు నెలల్లోనే ఇప్పటిదాకా ఏడుగురు ఇలా చనిపోయారంటే పరిస్థితి అర్థమవుతోంది. గత ఏడాది, అంతకు ముందు.. ఇలా ప్రతిఏడాది వేసవిరోజుల్లో ఇలాంటి ప్రమాదాలు జరిగిపోతూనే ఉన్నాయి. కానీ, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు మాత్రం శూన్యం. ఇటీవల మనుబోలు మండలం కాగితాలపూరులో ఇద్దరు పిల్లవాళ్లు తామరపూల కోసం చెరువులో దిగితే, అక్కడ గతంలో జేసిబితో మట్టితీసిన గుంతలు ఉన్నాయని తెలియక ఆ గుంతల్లో మునిగి చనిపోయారు. వారి తల్లిదండ్రుల వేదన అంతా ఇంతా కాదు. ఇదేమండలంలోని గురివిందపూడిలో చెరువులోకి దిగిన బిటెక్ విద్యార్థి అక్కడ గుంతలున్నాయని తెలియక.. ఆ గుంతల్లో మునిగిపోయి ప్రాణాలు కోల్పోయాడు. ఇలా అనేక సంఘటనలు జరుగుతూనే ఉన్నా జిల్లా అధికారయంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటోందని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## తవ్వకాలపై పర్యవేక్షణ ఏదీ?...

మట్టికోసం, ఇసుక కోసం, గ్రావెల్ కోసం ఎవరు ఎక్కడెక్కడ గుంతలు తవ్వుతున్నారో, ఏమేరకు తవ్వుతున్నారో పూర్తిస్థాయి పర్యవేక్షణ లోపం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారయంత్రాంగం కళ్ళు తెరచి, ఆయా గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బందితో సమావేశమై నిబంధనలకు విరుద్ధంగా చెరువులు, దొరువులు, కాలువల్లో విచ్చలవిడిగా జరుగుతున్న తవ్వకాలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ ఉండేలా చూడాలని, ఆ చర్యలు కూడా శాశ్వత ప్రాతిపదికపై ఉండాలని వారు కోరుతున్నారు.

## హెచ్చరిక బోర్డులు ఏవీ?....

గుంతలు తవ్వినప్పుడు "ఇక్కడ గుంతలు తవ్వివున్నాయి. ఈతకు దిగరాదు.. ప్రమాదకరం"..అని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించాలని, మరణించినవారి కుటుంబాల నుంచి, ఆయా ప్రాంతాల్లో స్థానికుల నుంచి వివరాలు తెలుసుకుని ఎక్కడెక్కడ గోతులు తవ్వివున్నాయో, అవి నిబంధనలకు విరుద్ధమో కాదో పరిశీలించాల్సి వుందని ప్రజలు కోరుకుంటున్నారు. గుంతలు తవ్వినచోట హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయించాలని గతంలోనే జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించివున్నా, ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయినచోట ఆ హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్లే ఈ దారుణాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గోతులు ఎక్కడ తవ్వారో గుర్తించి బోర్డులు పెట్టించాలని, లేకుంటే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎంతైనా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

## తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

అదేవిధంగా, తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలకు ఇలాంటి ప్రమాదాలు జరగకుండా, తమ పిల్లలు ఎక్కడంటే అక్కడ ఈతకు దిగకుండా, తగు జాగ్రత్తతో అనుక్షణం గమనిస్తూ ఉండాలి. పిల్లల భద్రత పట్ల ఏమరుపాటుతో ఉండడం ఏమాత్రం పనికిరాదు. ప్రమాదం జరిగిపోయాక ఎంత బాధపడినా ప్రయోజనం లేదు కనుక, ప్రమాదం జరగకముందే జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఎంతైనా ఉంది. అదేవిధంగా, జిల్లా ఉన్నతాధికార యంత్రాంగం ఇకనైనా ఈ ప్రమాదాలపై దృష్టిసారించాల్సి ఉంది. ప్రమాదాలు పునరావృతం కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అధికారయంత్రాంగం సంబంధిత నిపుణులు, వివిధశాఖల అధికారులతో సమావేశమై ముందుజాగ్రత్తలను రూపొందించి, ఈ జలగండాల బారి నుంచి బిడ్డలను కాపాడాల్సివుంది.

# ఆదర్శనీయుడు.. జక్కా వెంకయ్య

జక్కా వెంకయ్య ఆదర్శనీయుడని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని వక్తలు పేర్కొన్నారు. ఈ నెల 17న నెల్లూరులోని లారీయార్డ్ ఆవరణంలో ఏర్పాటుచేసిన సిపిఎం నేత దివంగత జక్కా వెంకయ్య సంతాపసభలో వారు మాట్లాడుతూ, ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసిన నాయకుడు జక్కా వెంకయ్య అని కొనియాడారు. జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.గోపాల్, సిపిఎం నాయకుడు మూలం రమేష్ మాట్లాడుతూ జక్కా వెంకయ్య పేదప్రజలకు చేసిన సేవలను వివరించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ మంచిస్థాయికి రావడానికి జక్కా వెంకయ్య కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అజయ్, నాగేశ్వరరావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిన్నారెడ్డి, నారాయణ, దామోదర్‌రెడ్డి, అంకయ్య, మహేష్‌రెడ్డి, హజరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోన ఆదాయం రూ.64.13లక్షలు

నెల్లూరుజిల్లా రాపూరు మండలం పెంచలకోనలో వేంచేసియున్న శ్రీలక్ష్మి నరశింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 19న మూడు ఆలయాల హుండీలను లెక్కించారు. 2017 ఏప్రిల్ 30వ తేదీ నుంచి ఈ నెల 19వ తేదీ వరకు 50రోజులకు గాను లక్ష్మి నరశింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామి ఆలయాల్లోని హుండీల లెక్కింపు ద్వారా 64లక్షలా 13వేల 283రూపాయలు ఆదాయం లభించింది. అలాగే అమెరికా డాలర్లు 12, కువైట్ దినార్లు 76, బంగారం 691గ్రాములు, వెండి 13కిలోల 370గ్రాములు వచ్చాయి.

## కాలధర్మం

# కాకుటూరు సూర్యప్రతాప్‌రెడ్డి



నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లోని హోటల్ అనురాగ్ అధినేత కాకుటూరు సూర్యప్రతాప్‌రెడ్డి ఈ నెల 16వ తేదీన కన్నుమూసారు. ఆయన వయస్సు 56సంవత్సరాలు. ఆయనకు భార్య, కుమార్తె వున్నారు. గత కొన్నేళ్ళుగా ఆయన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. అనురాగ్ సూరిగా మిత్రుల చేత పిలిపించుకోబడే సూర్యప్రతాప్‌రెడ్డికి రియల్ ఎస్టేట్ రంగంతో పాటు రైస్ ఇండస్ట్రీ, ఐస్ ఫ్యాక్టరీలతో పాటు పలు వ్యాపారాలున్నాయి. నిత్యం కష్టపడే వ్యక్తి. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్"

# బాబుకు ఓటమి భయం - ఎమ్మెల్యే కాకాణి

వచ్చే ఎన్నికల్లో టిడిపి ఓటమి పాలవుతుందని ఇప్పటినుంచే చంద్రబాబుకు భయం పట్టుకుందని సర్వేపల్లి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సిపి నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలం పరిధిలోని ఇందిరమ్మకాలనీ, వడ్డిపాళెంలలో ఈ నెల 20న సిమెంట్‌రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ, బాబు పాలనలో అభివృద్ధి జాడ కనిపించడం లేదన్నారు. నాయీబ్రాహ్మణులు తమ న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని కోరితే వారిపై ముఖ్యమంత్రి ఆగ్రహించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బాబు, బాలకృష్ణ ఇద్దరూ అహంకార పూరిత వాఖ్యలు చేస్తుండడం పట్ల ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. ఈ సందర్భంగా కాకాణి, మంత్రి సోమిరెడ్డిపై పలు ఆరోపణలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తలపల అరుణ, జడ్పీటిసి సభ్యుడు మందల వెంకటశేషయ్య, సర్పంచ్ పి.మణెమ్మ, మండల ఉపాధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, వైఎస్సార్‌సిపి జిల్లా కార్యదర్శి కనుపూరు కోదండరామిరెడ్డి, మండల కన్వీనర్ కె. చెంచుకృష్ణయ్య, మండల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే...

# ఉన్నత శిఖరాలు

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, విద్యతోనే ఉన్నతశిఖరాలు అందుకోగలమని అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 17న ఆయన నెల్లూరులోని సంఘమిత్ర పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని, టెన్త్‌లో ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులంతా క్రమశిక్షణతో బాగా చదవుకుని రాణించాలని, సమాజంలో మంచిపేరు తెచ్చుకుని ఉన్నత స్థాయిని అందుకోవాలని ఆకాంక్షించారు. శంభన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పురిణి శ్రీనివాసులు, కార్యదర్శి లేబూరు రంగయ్య, సభ్యులు వలిమేటి సుధాకర్, ఆట శ్రీనివాసులు, నాయకులు అశోక్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణంరాజు, ఆంజనేయరాజు, సుబ్బారావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో విత్తనశుద్ధి కేంద్రం

నెల్లూరుజిల్లాలోని రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించి, వారి పంట దిగుబడులను పెంచడమే లక్ష్యంగా నెల్లూరు మహాత్మాగాంధీ నగర్‌లోని ఏపి సీడ్స్ గోడౌన్‌లో విత్తనశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసామని సీడ్ గ్రోయర్స్ డైరెక్టర్ కె.శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 20న విత్తనశుద్ధి కేంద్రాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. రైతులకు ఏపి సీడ్స్ ద్వారా నాణ్యమైన విత్తనాలు అందజేస్తామన్నారు.

# అవోపా నూతనకార్యవర్గం ప్రమాణస్వీకారం

ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈ నెల 17న నెల్లూరులోని పప్పులవీధిలో ఉన్న ఎస్‌బిఎస్ కల్యాణమండపంలో జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా బివి రమణమూర్తి, వి.ప్రభాకర్, కోశాధికారిగా ఎం.సి కళాధర్, సహాయ అధ్యక్షులుగా ఏసిఎస్ గుప్తా, వి.వి కోటేశ్వరరావు, పివిఎస్ ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా సత్యనారాయణ, చుండూరు జగన్మోహన్, పొత్తూరు శ్రీనివాసులు, పేరకం వేణుగోపాల్‌తో పాటు మరో 13 మంది సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అదేవిధంగా, మహిళామండలి ఛైర్‌పర్సన్‌గా ఎస్.రాధ, కార్యదర్శిగా ఎస్.సులోచన, కోశాధికారిగా కె.శైలజ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో అవోపా పూర్వనాయకులు సొల్లేటి వెలుగొండయ్య, ఎన్.నమశ్శివాయ, ఎంపి ఆంజనేయులు, శ్రీరాం వెంకయ్య, ఎన్.కృష్ణకుమార్, వై.జగన్నాధంశెట్టి, జ్యోతి, కృష్ణప్రియ, రమాదేవి, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ నెల్లూరు అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, గోల్డ్‌మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్రలో...
# జగన్‌తో కలిసి అడుగులు వేసి..



తూర్పుగోదావరి జిల్లాలో ప్రజాసంకల్పయాత్ర నిర్వహిస్తున్న వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని ఇటీవల నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్‌లు కలిసారు. జిల్లా రాజకీయాలపై ఆయనతో చర్చించారు. అంతకుముందు నెల్లూరురూరల్ వైసిపి నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి కూడా జగన్‌ను కలిసి ఆయనతో పాటు పాదయాత్రలో పాల్గొన్నారు.

# సిజెఎఫ్‌ఎస్ భూములపై త్వరలో పరిష్కారం

### - రాష్ట్ర మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

సిజెఎఫ్ఎస్ భూముల లబ్దిదారులతో మూడు డివిజన్‌లకు సంబంధించి బహిరంగ సభలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 20న నెల్లూరు ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌లో జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు, జేసి వెట్రిసెల్విలతో కలసి సిజెఎఫ్‌ఎస్, చుక్కల భూములపై సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కృష్ణపట్నం గ్రామం నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ కాలనీలకు సంబంధించి జెన్‌కో, ఎన్‌సిసి, టిపిజిఎల్ సంస్థలతో సమీక్షించడం జరిగిందన్నారు. జిల్లాలోని సిజెఎఫ్‌ఎస్ భూములు దాదాపు లక్ష ఎకరాలు, చుక్కల భూములు మరో లక్ష ఎకరాలు ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన భూములను అసలైన లబ్దిదారులకు ఇచ్చేలా, వారికి ప్రభుత్వం నుంచి లబ్ది చేకూరేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకున్నారన్నారు. ఈ విషయమై లబ్దిదారులతో బహిరంగ సభలు ఏర్పాటు చేసి ప్రస్తుతమున్న సమస్యలు పరిష్కారించేలా చర్యలు తీసుకున్నామన్నారు. దేగపూడి, బండేపల్లి కెనాల్‌కు జీవో విడుదల చేసి రూ.10.30కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి 148ఎకరాల భూమి ఉందని, నెల్లూరు డివిజన్‌లో సేకరణ పూర్తయ్యిందని, గూడూరు డివిజన్‌లో కూడా త్వరితగతిన పూర్తవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో హరిత, జెన్‌కో, ఎన్‌సిసి, టిపిజిఎల్ ప్రతినిధులు, ఓఎస్డీ ప్రసాద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# నగర కిరీటం జయకేనా?



**జిల్లాలో తెలుగుదేశం పార్టీ స్థితిగతుల గురించి అధిష్ఠానం నాలుగేళ్ళుగా పట్టించుకోలేదు. ఇష్టం వచ్చిన రీతిలో పదవులు ఇచ్చుకుంటూ పోయారు. ఒక వర్గాన్ని తొక్కడమే లక్ష్యంగా పనిచేసారు. రాజకీయాలలో ఎక్కడం, తొక్కడం లాంటివి మంచిది కాదని ఇప్పుడు తెలుసుకున్నారు. అందుకే పార్టీలో వున్నవారిని పారిపోకుండా కాపాడుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు.**

నెల్లూరు నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అనే పదవి ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నగర కన్వీనర్ బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చాడు. తన పరిధిలో ఆయన పార్టీ కార్యక్రమాలను హుషారుగానే నిర్వహించాడు. పార్టీ తరపున ఆయన చేసిన ఉద్యమాలు, మోటార్‌బైక్‌ల ర్యాలీలు గుర్తించి ఇటీవల నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్ పదవిని కట్టబెట్టారు. పార్టీలో జోడు పదవులు వుండకూడదనే నిబంధనతో ఆయనను నగర కన్వీనర్ పదవి నుండి తప్పుకోమనే అవకాశాలున్నాయి. ఈ పదవిని పార్టీలో ఇంకొకరికి ఇవ్వడం ద్వారా ఒక నాయకుడినైనా సంతృప్తి పరచవచ్చనే ఉద్దేశ్యం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ పదవికి ఆనం జయకుమార్ రెడ్డి పేరు వినిపిస్తోంది.

ఆనం బ్రదర్స్‌లో మూడో వాడైన ఆనం జయకుమార్‌రెడ్డి 2014లో ఎన్నికల అనంతరం తెలుగుదేశంలో చేరాడు. తన తర్వాత తన అన్నలైన ఆనం వివేకా, ఆనం రామనారాయణరెడ్డిలు తెలుగుదేశంలో చేరినప్పటికీ ఆయన వారితో కలవలేదు. టీడీపీలో చేరినప్పటినుండి ఆదాల ప్రభాకర్‌రెడ్డినే అనుసరిస్తున్నాడు. రేపు కూడా ఆదాల ఎటుంటే ఆయనా అటే వుంటాడు. ఆదాలను పార్టీ వదలకుండా కాపాడుకోవాలనుకుంటున్న టీడీపీ అధిష్టానం పార్టీలో ఆయనకు ప్రాధాన్యత పెంచుతోంది. ఈ క్రమంలోనే ఆదాలకు అత్యంత సన్నిహితుడైన ఆనం జయకు నగర కన్వీనర్ బాధ్యతలను అప్పగించే అవకాశాలు లేకపోలేదు.

### ఆదాల రాఘవరెడ్డి జ్ఞాపకార్థం
# క్యాన్సర్ ఆసుపత్రికి భూరి విరాళం



స్వర్గీయ ఆదాల రాఘవరెడ్డి జ్ఞాపకార్థం నెల్లూరు పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి వారి కుటుంబసభ్యులు 20లక్షల రూపాయల విరాళం అందజేశారు. ఆసుపత్రిలో కొత్తగా నిర్మించనున్న పెథాలజీ ల్యాబ్‌కు ఆయన పేరు పెట్టాలని ఈ సందర్భంగా ఆదాల కుటుంబసభ్యులు కోరారు. హార్విన్స్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ అధినేత ఆదాల రాఘవరెడ్డి ఇటీవలే కాలధర్మం చెందారు. మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి, మ్యాక్ ప్రాజెక్ట్స్ అధినేత ఆదాల మురళీకృష్ణారెడ్డికి ఆయన అన్నవుతాడు. ఆదాల రాఘవరెడ్డి మెడినోవా డయాగ్నోస్టిక్స్ సెంటర్ సంస్థను స్థాపించి హైదరాబాద్ నగరంలో వైద్యసేవలు కూడా అందించారు. హార్విన్స్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ద్వారా ఎంతోమంది యువకులను ప్రోత్సహించి నిర్మాణ రంగంలో వారిని తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటి నెల్లూరు ఛైర్మెన్ ఏ.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆదాల కుటుంబం ఇచ్చిన ఈ విరాళం ఎంతో స్ఫూర్తిదాయకమని, ఈ విరాళంతో మంచి ల్యాబొరేటరీ భవనం నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ టి.లక్ష్మి కూడా పాల్గొన్నారు. ఆదాల రాఘవరెడ్డి జ్ఞాపకార్థం ఒక మంచి పని తలపెట్టిన కుటుంబ సభ్యులకు అభినందనలు.

# మనసును, శరీరాన్ని కలిపే అద్భుతం... యోగ




ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు, లెక్చరర్స్ కాలనీలోని నవనీత పార్కు వద్ద ఆరెస్సెస్ అనుబంధ సంస్థ ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో భారీ యోగా ప్రదర్శన నిర్వహించారు. దాదాపు 400మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ యోగాసనాలతో అలరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా తెలుగుదేశం నాయకులు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, అఖిల భారత ఆరోగ్య భారతి ప్రధానకార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ, ఆరెస్సెస్ జిల్లా అధ్యక్షులు పల్నాటి రామదండు, ఆరోగ్యభారతి రాష్ట్ర కమిటి సభ్యులు డాక్టర్ సి.వి.సుబ్రహ్మణ్యం, లెక్చరర్స్ కాలనీ వాకర్స్ సభ్యులు జి.శ్రీనివాసులురెడ్డి, అజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన వక్తలు... మనసును, దేహాన్ని ఒకే స్థితిలో ఉంచే బలమైన సాధనం యోగా అని చెప్పారు. ఈరోజు ప్రపంచ దేశాలన్నీ కూడా 'యోగా'ను ఆచరిస్తున్నాయని, యోగా సాధన ఎన్నో మానసిక శారీరక రుగ్మతలకు దివ్యౌషధంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. స్థానిక కార్పొరేటర్ దాసరి రాజేష్ పర్యవేక్షణ, సహకారంతో ఇక్కడ యోగా ప్రదర్శనలు ఎంతో ఆహ్లాదంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, పలువురు ఆరెస్సెస్, ఆరోగ్యభారతి సభ్యులు హాజరయ్యారు.

# ఎన్‌బికెఆర్‌లో అవగాహన సదస్సు




అవగాహన సదస్సులో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డా. వి.విజయకుమార్‌రెడ్డి

కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఈ నెల 20న కళాశాల ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కళాశాలలో సీటు పొందిన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. కళాశాలలో ఉన్న వివిధ కోర్సుల వివరాలు, సదుపాయాలు, కళాశాల విశిష్టతను వారికి తెలియజేశారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 21వ తేది నుంచి తరగతులు ప్రారంభం అయ్యాయన్నారు. ఈ సదస్సులో అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రుల పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# సరైన నిర్ణయం

**జమ్ముకశ్మీర్‌లో పిడిపి-బిజెపి సంకీర్ణప్రభుత్వం కుప్పకూలింది. పిడిపి నుంచి బిజెపి వైదొలగడం సంచలనమే. ఆలస్యం జరిగినా... ఇది సరైన నిర్ణయమే. అయితే, అంతమాత్రాన్నే కశ్మీర్‌లో శాంతి నెలకొనదు. భారత భూభాగంలోని జమ్ముకశ్మీర్‌లో..పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల హింసాత్మక చర్యలను పూర్తిగా నివారిస్తే తప్ప కశ్మీర్‌లో శాంతి ఉండదు. ఉగ్రవాదాన్ని అరికట్టడం ద్వారా కశ్మీర్‌లో శాంతి స్థాపనకు బాటలువేయాలి. ప్రజల భద్రతకు గట్టి చర్యలు తీసుకుని కశ్మీర్‌లో శాంతి బావుటా ఎగురవేయాలి.**

మనమొకటి తలిస్తే.. ఒక్కోసారి వేరొకటి జరిగి తీరుతుంటుందన్నది పెద్దల మాట. అయితే, జరగకూడని ఘోరం జరిగాకే... మనమెంత పొరపాటు చేశామో అర్ధమవుతుంది. అయితే, అప్పటికే పరిస్థితులు చేయిదాటిపోయివుంటాయి. ఇప్పుడు కశ్మీర్‌లో బిజెపి పరిస్థితి కూడా ఇదే. ఇక్కడ పిడిపితో కలసి పాలనసాగించి.. అనేక విభేదాలను సహిస్తూ వచ్చినా...చివరికి మిగిలిందేమిటి?.. తెగదెంపులే!... ఎట్లయితేనేమి.. మూడేళ్ళ కలహాల కాపురం తర్వాత ఎట్టకేలకు పిడిపితో బిజెపి తెగదెంపులు చేసుకుంది. దీంతో పిడిపి-బిజెపి సంకీర్ణకూటమి పాలనకు తెరపడి సంచలనం కలిగించింది. దీంతో, ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ తన పదవికి రాజీనామా చేయడంతో, కశ్మీర్‌లో గవర్నర్ పాలనకు రంగం సిద్ధమైంది. రంజాన్ సందర్భంగా కాల్పుల విరమణ ప్రకటించాలని కశ్మీర్ ముఖ్యమంత్రి మొహబూబాముఫ్తీ కోరడం, కశ్మీర్‌లో హింసను అదుపుచేసేందుకు రంజాన్-అమర్‌నాధ్ యాత్రల సందర్భంగా భద్రతాబలగాల చేత కాల్పుల విరమణ పాటింపజేయాలంటూ అఖిల పక్షభేటీ విజ్ఞప్తి చేయడంతో కేంద్రం వారి విజ్ఞప్తులను మన్నించింది.

అయితే, అందువల్ల ఆశించిన ఫలితం లేక పోగా.. అదే అదనుగా పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు మరింతగా రెచ్చిపోయి కశ్మీర్‌లో హింసాకాండకు తెగబడడం ఎంత దారుణం?.. పాక్ వేర్పాటువాద శక్తులు విజృంభించి కశ్మీర్‌లో మరింత హింసకు ఆజ్యం పోయడంతో కశ్మీర్ మళ్ళీ నిప్పులగుండమైది. కశ్మీర్‌లోని ప్రముఖ పాత్రికేయుడు సుజాత్‌బుఖారీని గుర్తుతెలియని దుండగులు కాల్చిచంపడం, వీర జవాన్‌గా ఉన్న ఔరంగజేబు అనే సైనికుడిని చిత్రహింసలు పెట్టి ప్రాణాలు తీయడం.. ఇలా పెరిగిపోతున్న హింసాత్మకజ్వాలలతో కశ్మీర్ భగ్గుమంటూనే ఉంది. ఇదంతా పాక్‌ప్రేరేపిత ఉగ్రవాదులు చేస్తున్న దుశ్చర్యలే. ఒకవైపు కశ్మీర్‌లో హింసను ప్రేరేపిస్తూనే, మరోవైపు అమర్‌నాధ్ యాత్రికుల యాత్రను భగ్నం చేసేందుకు పాక్‌ప్రేరేపిత ఉగ్రవాదులు విషసర్పాల్లా పొంచివున్నారనే సమాచారంతో కేంద్రం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో, పిడిపితో తెగదెంపులు చేసుకోవడానికి కూడా బిజెపి సిద్ధపడింది. పాలనపై పూర్తి అధికారం ఉంటే తప్ప జమ్ముకశ్మీర్‌లోని ఉగ్రవాదులు, వేర్పాటువాదులను సమర్ధంగా అణచలేమని భావిస్తూ అప్పటికప్పుడు బిజెపి ఈ నిర్ణయం తీసుకుంది. ఇది సరైన నిర్ణయమే.. కానీ, ఆ నిర్ణయమేదో ఎప్పుడో తీసుకుని ఉండాల్సింది. అయినా, శాంతిమంత్రాలు వల్లిస్తూ కూర్చుంటే ఉగ్రవాద రాకాసులు ఊరు కుంటారా?.. వారికి కావాల్సింది మారణ కాండలు.. నెత్తుటిముద్దలు.. హింసాజ్వాలలే తప్ప శాంతివచనాలు కాదు కదా!.. అందుకు వత్తాసుగా ముఫ్తీ ప్రభుత్వం ఉండడంతో పాక్ ఉగ్రవాదుల దుష్కృత్యాలు జోరుగా సాగుతున్నాయి. వాటికి అంతుపొంతూ ఉండడం లేదు.

హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది బుర్హాన్‌వనీని రెండేళ్ళ క్రితం భద్రతాదళాలు అంతమొందించినప్పుడు భద్రతాదళాల చర్యను బిజెపి అభినందించగా, పిడిపి అందుకు వ్యతిరేకించడం, భద్రతాదళాలపై రాళ్ళు విసిరినవారిపై కేసులు ఉపసంహరించాలని పిడిపి నిర్ణయించడం అందరికీ తెలిసిందే. ఆ తర్వాత కూడా కశ్మీర్‌లో పెరుగుతున్న దుశ్చర్యలను నిరోధించాలంటే, మెహబూబాముఫ్తీ ముఖ్యమంత్రిగా కొనసాగుతుండగా జరగదని, కశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదులు, వేర్పాటువాదులపై కఠిన చర్యలు తీసుకోవడం కుదరదని బిజెపికి అర్ధమైంది. అంతేకాదు, కశ్మీర్‌లో భద్రతా పరిస్థితుల్ని మెరుగుపరచడంలో పిడిపి విఫలమైందనేది కూడా జగమెరిగిన రహస్యమే.

అసలు ముఖ్యమైన విషయం ఏమిటంటే, జమ్ము-కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం. అయితే, పాక్ దుశ్చర్యలతో కశ్మీర్‌లో ఎంతోకాలంగా హింసాత్మక ఘటనలు జరుగుతూ ఉండడమే దారుణం. వాటిని ప్రభుత్వాలు నివారించలేకపోవడంతో కశ్మీర్‌లో నానాటికీ పరిస్థితులు దిగజారుతున్నాయి. కశ్మీర్‌లో ఉగ్రవాదం, హింస పెరిగిపోయి చివరకు ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే స్థితి ఏర్పడింది. పిడిపి-బిజెపి సంకీర్ణపాలన వల్ల ఒరిగిందేమీ లేదని, కశ్మీర్ పరిస్థితి పెనం మీంచి పొయ్యిలో పడినట్లయిందనే విమర్శల్లో వాస్తవం లేకపోలేదు. ఈ హింసాకాండల్లో కశ్మీర్‌లో గత మూడేళ్ళలో 373 మంది సైనికులు, 239 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని, కశ్మీర్‌ను పిడిపి-బిజెపి కూటమి నాశనం చేశాయని, ఈ మూడేళ్ళలో కశ్మీర్‌ను ఎంత వీలైతే అంత నాశనం చేసి ఇప్పుడు బిజెపి పక్కకు తప్పుకుందని, పిడిపితో పొత్తు పెట్టుకోవడం ద్వారా బిజెపి భారీ తప్పిదానికి పాల్పడిందని కాంగ్రెస్ నేతల విమర్శలు బిజెపికి కనువిప్పు కలిగించేవే. గత ఎన్నికల్లో 89 మంది సభ్యులున్న కశ్మీర్ అసెంబ్లీలో పిడిపికి 28, బిజెపికి 25 స్థానాలు లభించాయి. బిజెపికి మరో నాలుగు స్థానాలు దక్కివుంటే ఇప్పుడు ఈ పరిస్థితి ఉండేది కాదు. మిగిలిన వాటిలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి 15, కాంగ్రెస్‌కు 12, ఇతరులకు 7 స్థానాలు దక్కాయి. 2015లో పిడిపి-బిజెపి కూటమిగా ఏర్పడి ఇక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి. అసలు పిడిపి విధానాలకీ.. బిజెపి సిద్ధాంతాలకీ గిట్టదు. ఇరుపార్టీల మధ్య నాలుగామడల దూరం ఉండనే ఉంది. అయితే, కశ్మీర్‌లో హింసకు ముగింపు పలకాలన్న ధ్యేయంతో పిడిపి-బిజెపి అప్పట్లో కలసి ఒక్కటైనా.. పాలనలోకి వచ్చేసరికి ఆ లక్ష్యం అటకెక్కింది. పుణ్యం కోసం వెళ్తే పాపం ఎదురైందన్నట్లుగా తయారైంది బిజెపి పరిస్థితి. అందుకే పిడిపితో తెగదెంపులు చేసుకుంది.

ఏదేమైనా, పాకిస్తాన్ నుంచి అడ్డదారులు తొక్కుతూవచ్చి భారత్ భూభాగంలోని జమ్ము కశ్మీర్‌ను హింసాత్మక చర్యలతో భగ్గు మనిపిస్తున్న ఉగ్రవాదుల పీచమణచుకుంటే తప్ప కశ్మీర్ లోయలో శాంతి ఉండదు. ఉగ్రవాదులను పూర్తిస్థాయిలో అరికట్టకుంటే హింసే తప్ప ప్రశాంతత ఎక్కడా ఉండదు. ఇకనైనా కేంద్రం వెంటనే ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో సహా పెకలించివేయాలి. తద్వారా కశ్మీర్‌లో శాంతిస్థాపనకు కృషిచేయాలి. అదేవిధంగా కశ్మీర్ ప్రజల భద్రతకు, అభ్యున్నతికి గట్టిచర్యలు తీసుకుని... కశ్మీర్ తిరిగి కళకళలాడేలా.. శాంతిబావుటా ఎగురవేయాలి.

# నిర్ణయించిన ధరకే మినరల్ వాటర్

## - ఆర్టీసీ చైర్మెన్ వర్ల రామయ్య

మినరల్ వాటర్(పరిశుద్ధ నీరు) నిర్ణయించిన ధరలకే అమ్మాలని, ప్రయాణీకుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని అధిక ధరలకు అమ్మరాదని ఆర్టీసీ ఛైర్మెన్ వర్ల రామయ్య ఆర్టీసీ ప్రాంగణంలోని వ్యాపారులకు తెలిపారు. ఈ నెల 17న నెల్లూరు ఆర్టీసీ ప్రాంగణంలోని పలు దుకాణాలను ఆయన పరిశీలించారు. హోటల్‌లో తయారయ్యే ఆహారపదార్ధాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. తిరుపతి ప్లాట్‌ఫారం వైపు మరో టివిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రయాణీకులతో మాట్లాడి సదుపాయాలపై ఆరా తీశారు. మరుగుదొడ్లను పరిశీలించి వాటిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఈడీ మహేశ్వర్, ఆర్ఎం రవివర్మ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటిసభ్యులు బి.రవీంద్ర, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ ఫలితాల్లో సత్తా చాటిన 'ఆదిత్య' విద్యార్థులు

డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో నెల్లూరు, ఆదిత్య కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. విక్రమసింహపురి యూనివర్శిటీ విడుదల చేసిన ఈ ఫలితాల్లో బిఎస్సీ, ఎంఎస్‌సిఎస్ గ్రూప్‌లో ఎం.ప్రవల్లిక 99శాతం, పి.రాజేశ్వరి 99శాతం మార్కులతో ఉత్తీర్ణులు కాగా, ఎన్.రమ్య 98.33శాతం, ఎ.సుజాత 98శాతం, ఎం.నాగశిరీష 97.33శాతం, వి.సుష్మిత 97.33 శాతం, ఏ.శశాంక 95.33 శాతం మార్కులతో తమ ప్రతిభను చాటుకున్నారని కళాశాల నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా, బిఎస్సీ ఎంపిసిఎస్ గ్రూప్‌లో ఎస్.కె.రీనా 97.55శాతం, ఎస్.పావని 96.66 శాతం మార్కులతో ఉత్తీర్ణులయ్యారన్నారు. బయోటెక్నాలజీ గ్రూప్‌లో తనూషా 96.67శాతం, వి.చందుప్రియ 92శాతం, సిహెచ్ పవిత్ర 91.3శాతం మార్కులతో ఉత్తీర్ణత



సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డి.పుల్లయ్య తెలియజేశారు. అత్యుత్తమ మార్కులు సాధించిన తమ విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ ఆచార్య ఆదిత్య, డైరెక్టర్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు వి.శ్రీనివాసులు, రాజేశ్వరరెడ్డి, కమలాకర్, శైలజ, గాయత్రి, మహీధర్, మధు తదితరులు అభినందించారు.

# ఘనంగా ఫాదర్స్ డే

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఫాదర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. నెల్లూరులోని ఆచారివీధిలో ఉన్న నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ భవన్‌లో అధ్యక్షుడు నూకల శేషయ్యగుప్తా ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాది పుట్టా వెంకటశేషారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో తండ్రి ప్రాధాన్యత ఎంతో గొప్పదని కొనియాడారు. బిడ్డల ఎదుగుదలకు, అభివృద్ధికి నాన్నలు చేసే కృషి అద్వితీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు పచ్చిపులుసు శ్రీరాములు, దొంతంశెట్టి నరసింహారావు, అచ్యుత సుబ్రహ్మణ్యం, అమరా ప్రభాకర్, వాయుగుండ్ల వేణుగోపాల్, మాజీ కార్పొరేటర్ పుట్టా రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.





## చిన్నారులపై లైంగిక నేరాలు

చిన్నారులపై లైంగిక నేరాలు ఎంత మాత్రం తగ్గడం లేదు. ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట చిన్నారులను చిదిమేసిన దారుణాలు వెలుగులోకి వస్తూనేవున్నాయి. చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడే వారికి చాలా త్వరగా శిక్షలు అమలు చేయగలిగితేనే ఈ నేరాలు కొంతవరకు ఆగుతాయి. ఏళ్ళతరబడి కేసులను విచారించి నిందితులకు తీరుబడిగా శిక్షలు విధిస్తే లాభం లేదు. అప్పటికే ఆ కేసు ప్రాధాన్యత పోతుంది. నేరం జరిగాక కనీసం ఆరు నెలలలోపే నిందితులకు కఠిన శిక్షలు అమలు చేసేలా చట్టం తీసుకురావాలి. చిన్నారుల లైంగిక నేరాలకు సంబంధించి ప్రత్యేకకోర్టులను ఏర్పాటు చేయాలి. ఈ నేరాల దర్యాప్తుకు పోలీసు శాఖలో కూడా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి.

**లెక్కల సుజాత, మాచవరం.**

## ఎస్పీ గారు... బాగా చేసారు!

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ అన్నది ఒక భయానక వ్యవస్థ. ఈ ట్రాఫిక్ దెబ్బకు భయపడే చాలామంది ట్రంకురోడ్డు, నర్తకి సెంటర్, విఆర్‌సి సెంటర్ వంటి ప్రాంతాల్లో పనులున్నా కూడా ఎవరో ఒకరిని పంపించి చేయించుకుంటుంటారు. ఎస్పీ రామకృష్ణ నగరంలో ట్రాఫిక్‌ను కొంతవరకు సరిదిద్దారనిపిస్తోంది. ముఖ్యంగా జంక్షన్‌లను ఎత్తేసి 'యూటర్న్' విధానం ప్రవేశ పెట్టడం మంచి ఫలితాలనే ఇస్తుందని చెప్పొచ్చు. ఏ.సి కూరగాయల మార్కెట్, మురళీకృష్ణ హోటల్స్ వద్ద కూడా రోడ్డు వెడల్పు చేసి పార్కింగ్ ఎత్తేసారు. వాహనాల రాకపోకలకు సులభంగా వుంది.

**మినుములు జీవన్‌రెడ్డి, నెల్లూరు.**

## దాడి చేయడం సెక్యులరిజమా?

హిందూ సంస్కృతి, హిందూ జీవన విధానం ఇష్టం లేనివాళ్ళు వాటికి దూరంగా వుండొచ్చు. అంతేకాని హిందూ సంస్కృతిపై విమర్శలు చేయాల్సిన పనిలేదు. మేధావుల ముసుగులో కొందరు సూడో సెక్యులర్లు హిందువులను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నారు. హిందూ సంస్కృతిపై విష ప్రచారం చేస్తున్నారు. కల్బుర్గి, గౌరీ లంకేష్‌లు ఇలా రెచ్చగొట్టినవాళ్లే! కమల్ హాసన్, ప్రకాశ్‌రాజ్, అరుంధతీరాయ్ లాంటి వాళ్ళు కూడా హిందూ సంస్కృతిపై ఎప్పుడూ విషం కక్కుతూనేవున్నారు. ఇలాంటి చీడపురుగుల వల్లే లేనిపోని ఉద్రేకాలు చోటుచేసుకుంటున్నాయి.

**సి.రాజీవి, నెల్లూరు.**

# దిద్దుబాటులో 'దేశం'

***నెల్లూరుజిల్లాలో తెలుగుదేశం పరిస్థితి ఏమంత బాగాలేదు. గతంకంటే మెరుగు పడిందీ లేదు. 2014 ఎన్నికల్లో 10 అసెంబ్లీ స్థానాలకు గాను టీడీపీకి వచ్చింది 3 సీట్లే! ఇవి కూడా కొద్దిపాటి మెజార్టీతో గెలుచుకున్నవే! వీటిలో వైసిపి సంస్థాగత లోపాల కారణంగా 2 సీట్లు పోయాయి. ఇక నెల్లూరు లోక్‌సభతో పాటూ నెల్లూరుజిల్లాలోని నాలుగు అసెంబ్లీలు కలిసి వున్న తిరుపతి లోక్‌సభ స్థానాన్ని కూడా వైసిపి గెలుచుకోవడం జరిగింది.***

ఈ సీన్‌ను బట్టి జిల్లాలో తెలుగుదేశం ఎంత బలహీనంగా వుందో అర్ధం చేసుకోవచ్చు. టీడీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళయ్యింది. ఈ నాలుగేళ్ళ కాలంలో తెలుగుదేశం ఏమన్నా బలం పుంజుకుందా? ఈ నాలుగేళ్ళలో ఆనం సోదరులతో పాటు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, వాకాటి నారాయణరెడ్డి వంటి నాయకులు టీడీపీలో చేరారు. వైసిపిలో గెలిచిన గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కూడా టీడీపీలో చేరాడు. ఏమన్నా ఒరిగిందా? పార్టీకి ఓటింగ్ శాతం పెరిగిందా? గతంలోకన్నా ఎక్కువ సీట్లు గెలిచే అవకాశాలు ఏర్పడ్డాయా? తెలుగుదేశం ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో ఆదరణ పెరిగిందా? జిల్లాలో అలాంటి వాతావరణమేదీ కనిపించడం లేదు సరికదా, 2014 కన్నా జిల్లాలో పార్టీ బలహీనపడ్డ వాతావరణం కనిపిస్తోంది.

## చంద్రబాబు చిన్నచూపు

మొదట అధికారంలోకి వచ్చాక ఈ జిల్లా అభివృద్ధిపై చంద్రబాబు చిన్నచూపు చూసాడు. ఈ జిల్లా అంటే గిట్టనట్లు వ్యవహరించాడు. ఐదేళ్ళ వై.యస్. పాలనతో పోల్చి చూసినప్పుడు ఈ జిల్లాకు ఆయన చేసిందేమీ కనిపించలేదు. దాంతో స్వతహాగానే ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది. ఇక నియోజక వర్గాల వారీగా కూడా పార్టీ బలహీనంగానే ఉంది. టీడీపీకి నలుగురు ఎమ్మెల్యేలుంటే(జంపింగ్ ఎమ్మెల్యేతో కలిపి) ఆ నాలుగు నియోజకవర్గాలలోనూ వారి పట్ల వ్యతిరేకత వుంది. నెల్లూరు నగరం, రూరల్ నియోజక వర్గాలలో తెలుగుదేశాన్ని చంద్రబాబే పడుకోబెట్టాడు. ఏ జిల్లా కేంద్రంలోనూ తెలుగుదేశం నెల్లూరులో వున్నంత బలహీనంగా వుండదేమో! సర్వేపల్లిలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యక్తిగతంగా గట్టిగా పోరాడుతున్నాడు. ఇది రైతాంగం ఎక్కువ వుండే నియోజకవర్గం. ప్రభుత్వంపైన అన్నిచోట్లా వుండే వ్యతిరేకత ఇక్కడా వుంది. కాకపోతే సోమిరెడ్డి సొంతంగా గట్టిగా నిలబడుతున్నాడు. కావలిలో బీద సోదరుల నాయకత్వం వల్ల అక్కడ పార్టీ కనిపిస్తోంది. జిల్లాలో టీడీపీ వీక్ అనే సంకేతాలు అధిష్టానాన్ని తాకాయి. చంద్రబాబు నెల్లూరు జిల్లా రాజకీయాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది.




## నిలబెట్టుకోవడంలో విఫలం

ముఖ్యంగా మాజీమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పార్టీని వదిలిపోతున్నాడన్న విషయం టీడీపీలో ఆందోళన కలిగిస్తోంది. పార్టీలోకి వచ్చిన వాళ్ళను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యామనే భావన పార్టీ శ్రేణుల్లో కనిపిస్తోంది. ఆనం సోదరులకు ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. వివేకా చివరి రోజుల్లో వున్నప్పుడైనా ఆయనకు గౌరవప్రదమైన స్థానం కల్పించి వుంటే వాళ్ళు పార్టీని వదిలిపోకుండా వుండేందుకు ఆస్కారముండేది. ఆనంను పార్టీలో నిలబెట్టుకోలేక పోవడమన్నది పూర్తిగా చంద్రబాబు వైఫల్యమే! ఆనం పార్టీని వదిలి వైసిపిలోకి పోతే ఆ ఎఫెక్ట్ ఆత్మకూరు నియోజకవర్గంతో పాటు మరో నాలుగు నియోజకవర్గాల మీద కూడా పడుతుంది.

## తిరుగుబాటులో పెళ్ళకూరు

ఆనం అలా వుండగా కోవూరుకు చెందిన మరో నాయకుడు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి కూడా తిరుగుబాటు బాటలో వున్నాడు. ఆయన ఎదురు తిరిగినా కూడా కోవూరులో పార్టీకి నష్టం తప్పదు. వీరితో పాటు మరికొందరు నాయకులు కూడా టీడీపీని వీడే ఆలోచనలో వున్నట్లు సమాచారం.

## నిలబెట్టుకొనే ప్రయత్నాలు

చేతులు కాలాక ఆకులు పట్టుకోవాల్సిన దశలో తెలుగుదేశం అధిష్టానం అలర్ట్ అయ్యింది. ఆనం రామనారాయణరెడ్డి చేజారినట్లేనని ఖరారు చేసుకున్నారు. కాకపోతే వారి కుటుంబంలో వున్న మరో ఇద్దరిని నిలబెట్టుకునే ప్రయత్నాలు మొదలయ్యాయి. పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డిని బుజ్జగించే పనిలో కొందరున్నారు. ఎన్నికలనాటికి పార్టీ మారుతాడనే ప్రచారం వున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని జాగ్రత్తగా పట్టుకురావాలని నిర్ణయించి ఆయనకు అదనపు బాధ్యతలంటూ కొత్త పదవులు అప్పగిస్తున్నారు. ఉదయగిరిలో కంభం విజయరామిరెడ్డి చేజారిపోకుండా ఆయనకు రాష్ట్ర స్థాయి పార్టీ పదవిని గాలంగా విసురుతున్నట్లు తెలుస్తోంది. అలాగే డీసీసీబీ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డికి ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నారు.

ఇటీవలే నవనిర్మాణ దీక్షల ముగింపు సభను నెల్లూరుజిల్లాలోనే నిర్వహించిన చంద్రబాబు, ఈ నెల 30న దళిత తేజం ముగింపు సభకు కూడా నెల్లూరునే వేదికగా ఎంచుకున్నారు. దీనికి కారణం నెల్లూరు జిల్లాలో పార్టీపై ప్రత్యేక దృష్టి పెట్టి దిద్దుబాటు చర్యలకు పూనుకోవడమే!

▪ నగరంలో కీలకంగా ఆర్యవైశ్యులు

# రేపు ఎటు మొగ్గుతారో..



**వ్యాపారమన్నా, అన్నదానాలన్నా, గుళ్ళు గోపురాలన్నా గుర్తుకొచ్చేది ఆర్యవైశ్యులు. వాళ్ళ పనులు, వాళ్ళ వ్యాపారాలు వాళ్ళు చూసుకుంటుంటారు. ఎవరి జోలికీ రారు. ఎందులోనూ వేలు పెట్టరు. అలాంటి ఆర్యవైశ్యులలోనూ రాజకీయాలలో రాణిస్తున్న వాళ్ళున్నారు. కొణిజేటి రోశయ్య ఏ స్థాయికి వెళ్ళాడో చూసాం. ఆయనంత కాకపోయినా, ఆయనలాగే పోరాడుతున్నవాళ్ళు మరికొందరున్నారు.**

రాజకీయంగా పెద్దపెద్ద పదవులు లేకపోయినా రాజకీయాలలో వారి పాత్ర చాలా కీలకంగా వుంటుంది. ముఖ్యంగా పట్టణ, నగర ప్రాంతాల్లో ఏ పార్టీకైనా వారి మద్దతు చాలా అవసరం. అలాంటి అవసరమే ఇప్పుడు నెల్లూరు నగరంలోని పార్టీలకు కూడా వుంది. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో గెలుపోటములను శాసించగల స్థాయిలో ఆర్యవైశ్యుల ఓట్లున్నాయి.

నగర నియోజకవర్గంలో ముస్లింలు, కాపులు తర్వాత వారిదే మెజార్టీ. ఎంతో కాలం పాటు ఈ వర్గం తెలుగుదేశానికి అండగా నిలబడింది. ఆనం వివేకా హయాంలో రెండుగా చీలింది. కొందరు తెలుగుదేశం మద్దతుదారులైతే, మరికొందరు ఆనం అనుచరులుగా ముద్రపడ్డారు. 2009 ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను కాదని ఆర్యవైశ్యులు ప్రజారాజ్యం అభ్యర్థి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డికి మద్దతునిచ్చి గెలిపించారు. 2014 ఎన్నికల నాటికి సీన్ మారింది. ఆర్యవైశ్య వర్గాల నుండి నాయకుడిగా ఎదిగొచ్చిన ముక్కాల ద్వారకానాథ్ వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరాడు. ఆర్యవైశ్యుల మద్దతు కూడగట్టాడు. 2014 ఎన్నికల్లో నెల్లూరు నగరం నుండి మంచి మెజార్టీతో గెలిచిన వైసిపి అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌కు అధికశాతం వైశ్యులు అండగా నిలిచారు. ఈ నాలుగేళ్ళలోనూ ద్వారకానాథ్ డిప్యూటిమేయర్ కావడం, ఆర్యవైశ్యుల మద్దతు కూడగట్టడం, ఆర్యవైశ్యులకు గతంలో వై.యస్. చేసిన ఉపకారం, వైసిపి అధికారంలోకి వస్తే ఆర్యవైశ్యులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పిస్తానని ఇటీవల జగన్ చేసిన వాగ్దానం వంటి పరిణామాలన్నీ కూడా ఆర్యవైశ్యులను వైసిపి వైపు మొగ్గుచూపేలా చేస్తున్నాయి.

### ఈ జాతీయ నేతను..

# జైలుకెళ్ళి కలవాలా?



*ఆయన స్వాతంత్రోద్యమం చేసి జైలులో కూర్చోలేదు. కనీసం సమైక్యాంధ్ర ఉద్యమమో, ప్రత్యేకహోదా ఉద్యమమో చేసి జైలుకు పోలేదు. వందల కోట్లకు బ్యాంకులను మోసం చేసి, తన దాంబికాలకు ప్రజా సొమ్మును ఖర్చు చేసి, చేసిన మోసాలు, వేసిన వేషాలు బయటపడి, సిబిఐ దర్యాప్తు జరిపి నిజనిజాలు నిగ్గు తేల్చడంతో జైలుకు పోవాల్సి వచ్చింది. బ్యాంకులను నిలువునా ముంచిన ఆ యోధుడెవరో కాదు మన జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి.*

ఈ ఏడాది జనవరిలో బ్యాంకులను వందల కోట్లకు ముంచినందుకు గాను సిబిఐ విచారణ జరిపింది. ఆయనను బెంగుళూరులోని పరప్పర అగ్రహారం జైలు అంటే శశికళ వున్న జైలులోనే వుంచారు. మొన్నటి దాకా ఆయన ఏ జైలులో వున్నాడన్న విషయం కూడా జిల్లావాసులకు తెలియదు. కాకపోతే ఏదో ఒక జైలులో క్షేమంగా వున్నాడన్న విషయం తెలుసు. మన జిల్లా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలు ఇటీవల బెంగుళూరు వెళ్ళి పరప్పర అగ్రహారం జైలులో వున్న ఉద్యమయోధుడు వాకాటి నారాయణరెడ్డిని కలిసారు. ఆయనతో చర్చలు జరిపారు.

జిల్లాలో పలువురు నాయకులు టీడీపీని వదిలిపోతున్నారు. వాకాటి కూడా ఎక్కడ వదిలిపోతాడో, ఆయన వెనుక వుండే లక్షల ఓట్లు పోతాయేమోననే భయంతో జైలుకు వెళ్ళి ఆయనతో సంప్రదింపులు జరిపారట. బయట వున్న మంత్రులే తెలుగుదేశాన్ని కాపాడలేకపోతే జైలులో వున్న వాకాటి తెలుగుదేశంను ఉద్ధరిస్తాడా? అయినా వందల కోట్లకు బ్యాంకులను ముంచిన నాయకుల ప్రాపకంతో తెలుగుదేశం నిలదొక్కుకునే పరిస్థితి వచ్చిందా? ఇంతకంటే పార్టీని మూసేసుకోవడం మంచిది కదా!


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



## బిఎస్ఎన్ఎల్ పతంజలి ఆఫర్

బిఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో పతంజలి గ్రూప్ వారికి స్పెషల్ ఆఫర్‌లను అందించనున్నట్లు నెల్లూరు బిఎస్ఎన్ఎల్ పి.జి.ఎం.టి.డి ఎమ్.రవిబాబు 19వ తేదీ స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు. పతంజలి గ్రూప్ అయిన స్వాభిమాన్ న్యూస్, పతంజలి యోగ సమితి, మహిళ ప్రకోష్ట, యువభారత్, పతంజలి కిసాన్‌సేవ, స్వదేశీ సమృద్ధి కార్డ్ హోల్డర్ వారికి అతి తక్కువ ఛార్జీలతో ప్లాన్స్ అందిస్తున్నామన్నారు. 144 రూపాయలకు 30రోజులు, 792రూపాయలకు 180 రోజులు, 1584రూపాయలకు 365 రోజులు అన్‌లిమిటెడ్ కాల్స్‌తో పాటు 2జిబీ, ప్రతిరోజూ వంద ఎస్ఎంఎస్‌లు ఈ గ్రూప్ వారికి వుంటాయని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఫీజు రాయితీ ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జయప్రకాష్

ప్రైవేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ ఏ.పి వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు ఏ.జయప్రకాష్, వి.వెంకటేశ్వర్లులు జిల్లా కలెక్టర్ ముత్యాలరాజుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం గ్రీవెన్స్‌డేలో కలెక్టర్‌ను కలిసి వాళ్ళు ఇతర జిల్లాల్లో జర్నలిస్టు పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ ఇస్తున్నారని, నెల్లూరుజిల్లాలో కూడా ఫీజు రాయితీని అమలు చేయాలని కోరారు.

## రోమియో ప్రొఫెసర్


నెల్లూరులోని ఏ.సి. సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రొఫెసర్ చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేశారు. చంద్రశేఖర్ ఇటీవల ఒక ఫైనలియర్ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడడం, ఈ విషయాన్ని ఆమె తన ఇంట్లో తెలుపగా, కుటుంబసభ్యులొచ్చి ఈ కీచక ప్రొఫెసర్‌ను నలగదన్నడం, పోలీసులు అరెస్ట్ చేయడం వంటి సంఘటనలు జరిగాయి. అసలు ఏం జరిగిందనేదానిపై నిజానిజాలు తెలుసుకునేందుకు కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి ఐదుగురు ప్రొఫెసర్లతో కమిటీ వేశారు. వారు విచారించి అయ్యవారి కామగోల నిజమేనని నివేదిక ఇచ్చారు. ప్రిన్సిపాల్ ఈ నివేదికను డిఎంఇకి పంపించారు. దీంతో ప్రొఫెసర్ చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ డిఎంఇ నుండి ఉత్తర్వులు వచ్చాయి. బుద్ధి, జ్ఞానం బోధించాల్సిన ప్రొఫెసర్లే ఇలాంటి బుద్ధిమాలిన పనులకు పాల్పడితే ఎలా?

## మండే సూర్యుడు

వాతావరణ మార్పుల వల్ల జూన్ ఆఖరికొచ్చినా ఎండ తీవ్రత ఏ మాత్రం తగ్గడం లేదు. వారంరోజులుగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# నెల్లూరు కబుర్లు

## 30న వస్తున్న ముఖ్యమంత్రి



ఈ నెల 8వ తేదీన నవ నిర్మాణ దీక్ష ముగింపు సభ కోసం నాయుడుపేటకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడు వారాలు తిరక్కముందే మళ్ళీ నెల్లూరొస్తున్నారు. 'దళిత తేజం - తెలుగుదేశం' ముగింపు కార్యక్రమాన్ని ఈ నెల 30న నెల్లూరులో జరపాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు కూడా హాజరుకానున్నారు. దీనికి విఆర్‌సి గ్రౌండ్, ఏ.సి స్టేడియంలను కాదని బాలాజీనగర్ శివారులో వున్న శ్రీ వేణుగోపాలస్వామి కాలేజ్ మైదానాన్ని ఎంపిక చేసుకున్నారు. అదయితే హైవే ఆనుకుని వుంటుంది కాబట్టి ట్రాఫిక్‌కు ఇబ్బంది వుండదు. ఈ ముగింపు సభను లక్షమందితో జరపాలనుకుంటున్నారు. మరి నాయకులు ఎన్ని అగచాట్లు పడాలో ఇంతమంది జనాన్ని సమీకరించాలంటే!

### నారాయణ పుట్టిన రోజును

## పండుగగా చేసుకున్న తమ్ముళ్ళు



నారాయణ బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ జన్మదినోత్సవాన్ని ఈ నెల 15వ తేదీన జిల్లాలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఒక పండుగలాగా చేసుకున్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పెద్ద కేక్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ అబ్దుల్ అజీజ్‌లు కట్ చేసి అందరికీ తినిపించారు. ఈ వేడుకలలో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.అనూరాధ, డాక్టర్ బి.జ్యోత్స్నలత, పార్టీ కార్యాలయ సమన్వయ కార్యదర్శి బి.మనోహర్‌రెడ్డి, ధర్మవరం సుబ్బారావు, కార్పొరేటర్లు డి.రాజానాయుడు, మామిడాల మధు, దాసరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే విఆర్ హైస్కూల్‌లోని మున్సిపల్ జూనియర్ కాలేజీలోనూ మంత్రి నారాయణ పుట్టిన రోజు పండుగ జరిపారు. టి.అనూరాధ ఈ వేడుకల్లో పాల్గొని విద్యార్థులకు కేకలు తినిపించారు.

## జూలు విదిల్చిన ఎస్పీ



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ, పాల్గొన్న పోలీసు సిబ్బంది

ఈ నెల 19వ తేదీన నెల్లూరు పోలీసుగ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ సిబ్బందిపై ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. విధుల్లో ఇక అలసత్వం సహించేది లేదంటూ ఘాటుగా హెచ్చరించారు. ఇటీవల కాలంలో చోరీలు పెరుగుతుండడం, నేరాలు జరుగుతుండడం, ఎన్ని చర్యలు తీసుకున్నా అక్రమ రవాణా ఆగకపోతుండడంపై ఆయన చాలా సీరియస్‌గా స్పందించారు. ఉదయం 10గంటల నుండి రాత్రి 8గంటల దాకా ఏకధాటిగా 10గంటలపాటూ పోలీసు అధికారులను మాటలతో చీల్చిచెండాడారు. సిలికా అక్రమ రవాణాను అరికట్టలేకపోతున్నారంటూ గూడూరు డివిజన్ పోలీసులపై మండిపడ్డారు. అక్రమ రవాణాకు సహకరించే వారెవరినీ వదిలే ప్రసక్తే లేదని, రాజకీయ ఒత్తిళ్ళను ఏ మాత్రం పట్టించుకోవద్దని సూచించారు. ప్రత్యేకబృందాలతో సిలికా, ఇసుక అక్రమరవాణాలపై తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అక్రమ రవాణాను అరికట్టలేకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ట్రాన్స్‌పోర్ట్ వాహనాలన్నింటికి జిపిఎస్ అమర్చాలని, అలా అమర్చుకోని వాహనాలపై కేసులు నమోదు చేస్తామన్నారు. విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టి సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేయాలని హెచ్చరించారు. ఎస్పీ ఈ సమీక్షలో బెల్టుషాపులు, రౌడీయిజం, దొంగతనాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వంటివాటిపై కూడా మాట్లాడారు. జిల్లాలో పనితీరు బాగాలేక వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న 40మందికి పైగా సిఐలు, ఎస్ఐలకు ఛార్జ్‌మెమోలు జారీ చేసారు.

## శివయ్యకు ప్రాకార రథం



నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి ప్రాకారోత్సవానికి గాను నగరానికి చెందిన కాంట్రాక్టర్ ఆర్.శ్రీనివాసులురెడ్డి ప్రాకార రథాన్ని బహుకరించారు. ఈ నెల 18వ తేదీ ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ రథాన్ని ఆలయ ఛైర్మన్ ఆల్తూరి గిరీష్‌రెడ్డికి అప్పగించారు. గూడూరుకు చెందిన శిల్పి తాళ్ళపాక గురుబ్రహ్మాచారి మూడు నెలలపాటు శ్రమించి 12అడుగుల ఎత్తు, 5అడుగుల వెడల్పుతో, 4లక్షల ఖర్చుతో ఈ ప్రాకార రథాన్ని తీర్చిదిద్దారు. ఆలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రాకార రథోత్సవం కోసం దాత రథాన్ని తయారుచేసి ఇచ్చాడని ఆలయ ఛైర్మన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రధానార్చకులు బాలాజీస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా రథానికి గణపతిపూజ, నవగ్రహ హోమం, రుద్రహోమం, సంప్రోక్షణ, పూర్ణాహుతి నిర్వహించారు. ఆ తర్వాత భువనేశ్వరీదేవి సమేత మూలస్థానేశ్వరస్వామిని కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, ఇ.ఓ ఆరంబాకం వేణుగోపాల్, రంగనాయకులస్వామి గుడి ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవ చేస్తున్నాం

### - వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రంగారావు



రంగారావుకు విరాళం చెక్కును అందజేస్తున్న ఎం.వి.సుబ్బారెడ్డి

సమాజానికి అవసరమైన పలు సేవా కార్యక్రమాలను అంతర్జాతీయ స్థాయిలో చేపడుతున్నామని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ కె.రంగారావు తెలిపారు. ఈ నెల 17న నెల్లూరుకు వచ్చిన ఆయన జిల్లాలోని పలు వాకర్స్ సంఘాల పనితీరు, వారు చేపడుతున్న సేవా కార్యక్రమాలను స్వయంగా తిలకించారు. అనంతరం నెల్లూరులోని శ్రీ నేతాజీ ఎంఎస్ఆర్ ఫైలట్ స్కూలులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 32ఏళ్ళుగా జిల్లా, రాష్ట్రం, దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లోనూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. దాదాపు 1200 సంఘాలు ఏర్పడ్డాయని, వీటిలో అయిదు లక్షల మంది సభ్యులు ఉన్నారన్నారు. నడక ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మాజీఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ చెలికాని సీతారామయ్య మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజానికి ఈ సంఘం ఎంతగానో పనిచేస్తోందన్నారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో చేపట్టనున్న సేవా కార్యక్రమాల బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘాలు చేపడుతున్న సేవా కార్యక్రమాలకు తనవంతుగా ఇంటర్నేషనల్ ఏరియా కో-ఆర్డినేటర్ యం.వి.సుబ్బారెడ్డి రూ.25వేలు చెక్కును రంగారావుకు అందించారు. ఏరియా వైస్‌ప్రెసిడెంట్ ఎ.రామకృష్ణ, రీజినల్ ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటి గవర్నర్ పట్టాభిరామిరెడ్డి, నాగరాజు, సురేష్‌బాబు, ఈశ్వరరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, వెంకటాద్రి పాల్గొన్నారు.

## సర్వేయర్‌లను బ్లాక్‌లిస్ట్ నుండి తొలగించాలి

బిల్డింగ్ ఆన్‌లైన్ అనుమతులకు సంబంధించి వెబ్‌సైట్‌లోని లోపాలను సవరించాలని, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయకుండా లైసెన్స్‌డ్ సర్వేయర్‌లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం మంచిది కాదని నెల్లూరు డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్ అభిప్రాయపడ్డారు. లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అసోసియేషన్ సభ్యులు ఈ నెల 18వ తేదీన డిప్యూటీ మేయర్ ద్వారకను ఆయన ఛాంబర్‌లో కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్‌ల సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వైసిపి చీఫ్ విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్, కార్పొరేటర్లు గోగుల నాగరాజు, ఓబిలి రవిచంద్ర, సర్వేయర్ల అసోసియేషన్ సభ్యులు సి.హెచ్.శ్రీనివాసకుమార్, ఎస్.కె.హిదయతుల్లా, పొంగూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు తీర్చండి

## - సాధికార మిత్రలకు మంత్రి నారాయణ ఆదేశం



సాధికార మిత్రల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పి.నారాయణ

సాధికార మిత్రలు తమకు కేటాయించిన 35 కుటుంబాల వారి సమస్యలను 1100 నంబర్‌కు ఫోన్ చేసి, వారి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ ఆదేశించారు.

ఈ నెల 16న నెల్లూరు, గోమతి నగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో 14, 15 డివిజన్ల సాధికార మిత్రలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలుచేసే ప్రతి పథకం సాధికార మిత్రలు వారు దత్తత తీసుకున్న 35 కుటుంబాల వారికి తెలియజేయాలన్నారు. వారి కుటుంబాల్లో ఏ సమస్యలు వచ్చినా అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతి కుటుంబం వారి సగటు ఆదాయం పెంపొందించుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. సాధికార మిత్రలకు త్వరలో గుర్తింపు కార్డులు మంజూరుచేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.అనూరాధ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, జిల్లా టిడిపి మహిళా అధ్యక్షురాలు విజేత, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

## • ఎన్‌బికెఆర్‌కు ప్రత్యేక గుర్తింపు



గవర్నర్ నరసింహన్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డా. సి.రవీంద్రరెడ్డి

# రక్తదానంలో ప్రథమ స్థానం

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నెల్లూరుజిల్లా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి ప్రత్యేకగుర్తింపు లభించింది. 2017-18 సంవత్సరానికి గాను కళాశాల తరపున నిర్వహించిన రక్తదాన శిబిరాల ద్వారా రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల కంటే అత్యధిక యూనిట్ల రక్తాన్ని సేకరించినందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ నరసింహన్ అందించిన ప్రశంసాపత్రాన్ని కళాశాల తరపున డా॥ సి.రవీంద్రరెడ్డి అందుకున్నారు. కళాశాలలో ప్రతి సంవత్సరం రక్తదాన కార్యక్రమంతో పాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను కళాశాల కరస్పాండెంట్, నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మెన్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నారు.

రక్తదాన కార్యక్రమంలో పాల్గొని రాష్ట్రస్థాయిలో తమ సంస్థను ప్రథమ స్థానంలో నిలిపిన కళాశాల విద్యార్థులకు, సిబ్బందికి కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, డైరెక్టర్ డా॥ వి.విజయ్‌కుమార్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

# 'శుభమస్తు' ఈద్‌కా తోఫా విజేత సురేష్



డ్రా తీసి విజేతను ప్రకటిస్తున్న మేయర్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లోని శుభమస్తు షాపింగ్‌మాల్ రంజాన్‌ను పురస్కరించుకుని నిర్వహించిన 'ఈద్‌కా తోఫా' హ్యుండాయ్ కారు డ్రా విజేతగా నెల్లూరు మూలాపేటకు చెందిన సురేష్ నిలిచారు. ఈ నెల 18న షాపింగ్‌మాల్‌లో నగర మేయర్ అబ్దుల్ అజీజ్ డ్రా తీసారు. సురేష్‌ను విజేతగా ప్రకటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మేలిమి వస్త్రాలను పండుగలకు అతితక్కువ ధరలకు అందజేస్తున్న షాపింగ్‌మాల్ నిర్వాహకులు బయ్యా సోదరులను అభినందించారు. రంజాన్ పండుగ సందర్భంగా డ్రా నిర్వహించి కొనుగోలుదారుల ఇంట ఆనందోత్సాహాలు వెల్లివిరిసేలా బహుమతులు అందజేయడం హర్షణీయమన్నారు. షాపింగ్‌మాల్ అధినేత బయ్యా రవికుమార్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ సందర్భంగా నెల్లూరు, తిరుపతికి చెందిన శుభమస్తు షాపింగ్‌మాల్ కస్టమర్ల కోసం నిర్వహించిన ఈద్‌కాతోఫా కారు డ్రాను నెల్లూరులో తీయడం జరిగిందన్నారు. తమను ఆదరిస్తున్న తిరుపతి, నెల్లూరు ప్రాంతాల వినియోగదారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# దళితులు చంద్రన్నకు దన్నుగా నిలవాలి



'దళిత తేజం - తెలుగుదేశం' బహిరంగసభ గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న తెదేపా నాయకులు

స్వర్గీయ ఎన్టీరామారావు తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసి బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచారని, ఆయన స్ఫూర్తితో సిఎం చంద్రబాబునాయుడు దళితుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు.

ఈ నెల 17న టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లాలోని టిడిపి ఎస్సీసెల్ నాయకులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దళితులందరూ మనల్ని అన్ని విధాలా ఆదుకుంటూ, మన సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న చంద్రబాబు నాయుడుకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీ ఛైర్మెన్ వర్ల రామయ్య మాట్లాడుతూ దళిత తేజం - తెలుగుదేశం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతమైందన్నారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రయత్నిస్తుంటే ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి ఒక్క మాట మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఎస్సీ, ఎస్టీలకే ఇవ్వడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు ఎరిక్షన్ బాబు, బల్లి దుర్గాప్రసాద్, పరసా రత్నం, నెలవల సుబ్రహ్మణ్యం, జ్యోత్స్నలత, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ, తెలుగు మహిళా అధ్యక్షురాలు ముప్పాళ్ళ విజేత, మాజీ అధ్యక్షురాలు అంచల వాణి తదితరులు పాల్గొన్నారు.

# బిజిఆర్ విద్యార్థినుల విజయభేరి



డిగ్రీ విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ జె.వి.రెడ్డి

విక్రమ సింహపురి యూనివర్శిటీ విడుదల చేసిన డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో డా॥ బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు విజయభేరి మోగించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరి, కరస్పాండెంట్ జె.వి.రెడ్డి విద్యార్థినులను అభినందించారు. రెండవ సెమిస్టర్‌లో 90శాతం, 4వ సెమిస్టర్‌లో 81శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. బిఎస్‌సి మైక్రోబయాలజి, కెమిస్ట్రి, బయోకెమిస్ట్రి విభాగంలోని రెండవ సెమిస్టర్‌లో టి.శార్వాణి 99.3శాతం, బిఎస్‌సి బయోటెక్నాలజి, కెమిస్ట్రి, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగంలోని రెండవ సెమిస్టర్‌లో ఎస్.కె.సుమయా తబసుం 94శాతం, 4వ సెమిస్టర్‌లో ఎస్.కె.మెహతాజ్ 90శాతం, బిఎస్‌సి మ్యాథమ్యాటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్‌సైన్స్ విభాగంలో 4వ సెమిస్టర్‌లో యన్.శైలజ 95శాతం, బి.కాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 4వ సెమిస్టర్‌లో ఎస్.కె.సిమ్రన్ 90శాతం, 2వ సెమిస్టర్‌లో యం.నిరీష 91శాతం మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ మృదుల తెలిపారు.

# 'ఐ లవ్ నెల్లూరు' అంటున్న శీనయ్య



తనకొచ్చిన నుడా ఛైర్మెన్ పదవి ద్వారా నెల్లూరు నగరానికి ఎంతోకొంత పని చేయాలనుకుంటున్న కోటంరెడ్డి శీనయ్య కొత్త కొత్త ఆలోచనలకు శ్రీకారం చుడుతున్నాడు. ఈ క్రమంలోనే 'ఐ లవ్ నెల్లూరు' అంటున్నాడు.

ప్రజాప్రతినిధులతో పాటు నెల్లూరు ప్రజలు కూడా నెల్లూరు అభివృద్ధిని తమ కర్తవ్యంగా భావించాలని, అప్పుడే నెల్లూరు సుందరనందన వనంగా తయారవుతుందని చెబుతున్నాడాయన. అందుకే 'ఐ లవ్ నెల్లూరు' కాన్సెప్ట్‌ను రూపొందించినట్లు చెప్పారు. 19వ తేదీ ఆయన నెల్లూరులోని స్వర్ణాల చెరువు వద్దకెళ్ళి త్వరలో చేపట్టనున్న ఘాట్, ట్యాంక్‌బండ్ పనులను పరిశీలించారు. అనంతరం ఇరుకళలమ్మ గుళ్ళోకి వెళ్ళి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుళ్ళోనే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు బస్టాండ్ వద్దగల అమరజీవి పొట్టి శ్రీరాములు బొమ్మ వద్ద నుండి అభివృద్ధి పనులకు అంకురార్పణ చేస్తున్నట్లు చెప్పారు. అక్కడి ఫ్లైఓవర్ క్రింద చెత్తాచెదారాలు తొలగించి పచ్చని మొక్కలు నాటి పరిశుభ్రతకు పెద్దపీట వేస్తామన్నారు. ప్రజలు కూడా ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా నెల్లూరును శుభ్రంగా వుంచాలని ఆయన కోరారు. నెల్లూరు నగరాభివృద్ధికి మంత్రి నారాయణ ఎంతో కష్టపడుతున్నారని, ఆయనకు మరింత శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని ఇరుకళలమ్మను ప్రార్థించినట్లు శీనయ్య చెప్పారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## చిన్నారులకు అక్షరాభ్యాసం



పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా బ్రాహ్మణ సంఘాల సమితి పిలుపు మేరకు గూడూరు బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య మరియు యువజన విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గూడూరు శివాలయంలో ఈ నెల 20న ఉచిత సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం ఉదయం 8 గంటల నుండి 10గంటల వరకు జరిగిందని గూడూరు బ్రాహ్మణ సేవాసమాఖ్య ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి పూజ, సరస్వతి పూజ అనంతరం గూడూరు పట్టణ మరియు రూరల్ గ్రామాల నుండి 3సం॥ల నుండి 5సం॥ల వయస్సు ఉన్న అంగన్‌వాడి పిల్లలకు అక్షరాలు దిద్దించి, పాల్గొన్న పిల్లలకు ఉచితంగా పలకలు బహుకరించామన్నారు. వై. చిట్టిబాబు పిల్లలకు పలకలు బహుక రించారన్నారు. బ్రాహ్మణ సేవాసంఘాల సేవలు కులమతాలకు అతీతంగా సమాజంలో అందరూ ఒక్కటే అన్న భావనకు దోహదపడేలా చేస్తున్నామని శివకుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు బ్రాహ్మణ సేవాసంఘాల కో-ఆర్డినేటర్ ఎస్.వి. శ్రావణ్‌కుమార్, కమిటీసభ్యులు శ్రీనివాసులు, త్రిమూర్తి, మధుసూధనరావు, సిహెచ్ ప్రసాద్, పవన్‌కుమార్, దినకర్, బాలాజీ, జనార్ధనరావు, నరేష్, పురుషోత్తం, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి




మాట్లాడుతున్న ఆర్టీవో చందర్

అర్హత కలిగిన ప్రతిఒక్క వాహనదారు ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలని గూడూరు ఉప రవాణా శాఖాధికారి చందర్ తెలిపారు. గూడూరు మండలం చెన్నూరు, పుట్టంరాజు వారికండ్రిగ గ్రామాల్లో 18వ తేదీ ఎల్ఎల్ఆర్ మేళాను రవాణాశాఖాధికారులు నిర్వహించారు. తొలుత చెన్నూరు పంచాయితీ కార్యాలయంలో ఆర్టీవో చందర్ లాంఛనంగా సేవలను జడ్పీటీసీ సభ్యుడు పద్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజల వద్దకే రవాణాశాఖాధికారులు పేరిట కామన్ సర్వీస్‌పాయింట్ ద్వారా ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్సులను ఇస్తున్నట్లు చెప్పారు. పలువురికి ఎల్ఎల్ఆర్ పరీక్షలను నిర్వహించారు. వాహనాలు ప్రమాదం నుంచి రక్షించుకోవాలంటే తొలుత అర్హత కలిగిన వ్యక్తులు నడపడం వల్లే సాధ్యమని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు రాకపోవడంతోనే అధికారులే పల్లెలకు వచ్చి నేరుగా పత్రాలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రవాణాశాఖాధికారి జకీర్, సర్పంచి శివకుమార్‌లు పుట్టంరాజు వారికండ్రిగలో జరిగిన ఎల్ఎల్ఆర్ మేళాలో యువతకు, ప్రజలకు పరీక్షలను నిర్వహించి అర్హులైన వారికి ఎల్ఎల్ఆర్‌లను జారీచేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖాధికారి కరుణాకర్, ఎంపిటిసి సభ్యుడు పెంచలరావు, స్థానికులు ఉన్నారు.

## కౌన్సిలర్ వైద్యానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు పురపాలక సంఘం 28వవార్డు కౌన్సిలర్ ఇజ్రాయిల్ కుమార్ కిడ్నీ మార్పిడి చికిత్స నెల్లూరు నారాయణ ఆసుపత్రిలో పొందుతున్నారు. 18వ తేదీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 4లక్షల ఎల్వోసీలను నెల్లూరులో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. గూడూరులో ఎవరైనా అనారోగ్యంతో చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే, సీఎం సహాయనిధి నుంచి చికిత్స కోసం నగదు మంజూరుకు చర్యలు తీసుకుంటామని పాశం చెప్పారు.

## పొణకా దంపతులకు వేమిరెడ్డి పరామర్శ



పొణకా దంపతులను పరామర్శిస్తున్న ఎం.పి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి

గూడూరు పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన మరిది, పారిశ్రామికవేత్త పొణకా శివకుమార్‌రెడ్డి తమ్ముడు, పాలిటెక్నిక్ కళాశాల విభాగాధిపతి మేజర్ పొణకా శ్రీనివాసులురెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలోనే ఎం.పి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 16వతేదీ పొణకా దేవసేన కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాసులురెడ్డితో చాలాకాలంగా స్నేహ బంధం ఉందని, ఆయన అకాల మరణం కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, సోమవారం నెల్లూరు మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పొణకా దంపతులను పరామర్శించారు, తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మనపాటి రవీంద్రబాబు, కొండూరు కోదండరామయ్య, బాలిబోయిన రమేష్‌తో పాటు బసివిరెడ్డి అశోక్‌రెడ్డి, దొర్నాదుల సునీల్‌కుమార్‌శెట్టి ఉన్నారు.

## వేడుకగా డాక్టర్ జనార్ధన్‌రెడ్డి వివాహ వార్షికోత్సవం

- ఆకట్టుకున్న దివ్యాంగుల సంగీత విభావరి

గూడూరు రోటరీ భవన్‌లో దివ్యాంగులు నిర్వహించిన లలిత, సినీ సంగీత విభావరి శ్రోతలను ఆనందపరవశుల్ని చేసింది. ప్రముఖ రొటేరియన్ డా॥ సి.జనార్ధనరెడ్డి – డా॥ సి.రోహిణిల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు నగర ప్రముఖులు, వైద్యులు పాల్గొన్నారు. డాక్టర్ దంపతులకు రోటరీ అధ్యక్షులు పసుపులేటి మునిరాజా, కార్యదర్శి బాలకృష్ణంరాజు అభినందనలు తెలుపుతూ పట్టణంలోని పలు ధార్మిక, విద్యా, వైద్య, సేవా సంస్థలకు వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డా॥ ఎస్.వి.నాగేంద్రప్రసాద్ రచించిన అభినందన పత్రాన్ని సీనియర్ రొటేరియన్ బి.దశరథరామిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులతో పాటు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షకార్యదర్శులు ప్రభా రామకృష్ణారెడ్డి, విష్ణువందన, ఇన్నర్‌వీల్ సభ్యులు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.



అభినందన పత్రం అందుకుంటున్న డా॥ సి.జనార్ధన్‌రెడ్డి దంపతులు

అనంతరం అంధులైన గాయకులు స్వయంగా నిర్వహిస్తున్న విశ్వవెలుగు ఎవర్‌గ్రీన్ మ్యూజికల్ ఆర్కెస్ట్రా ద్వారా జి.వెంకి, పద్మ తదితర గాయకులు సంగీత కచేరి చేశారు.

## మార్మోగిన 'వాసవి' నామస్మరణం

- భక్తిశ్రద్ధలతో నామశిలల ప్రతిష్ట
- తరలివచ్చిన ఆర్యవైశ్యులు
- భక్తజనంతో క్రిక్కిరిసిన అమ్మవారి ఆలయం



శ్రీవాసవి అమ్మవారి గర్భగుడిలో నామశిలలను అందజేస్తున్న ముక్కాల ద్వారకానాథ్ దంపతులు

నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్ పేటలో పునర్నిర్మిస్తున్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం 'వాసవి' నామ స్మరణలతో మార్మోగింది. ఈనెల 17న ఈ ఆలయంలో 'వాసవి నామశిలల' ప్రతిష్ట కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలమండలి గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, అధ్యక్షుడు దాసా సురేష్ రాజా సారధ్యంలో కన్యకాపరమేశ్వరి గర్భాలయంలో వాసవి నామశిలలను ప్రతిష్టించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్దపెట్టున చేసిన వాసవి నామస్మరణలతో ఆలయం హోరెత్తింది. దాదాపు రెండువేలమందికి పైగానే ఆర్య వైశ్య దంపతులు ఈ ఆలయానికి తమ ఇళ్ళ నుంచి ఎంతో భక్తితో అర్చన చేసిన శిలలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారి బాలాలయంలో ప్రధాన అర్చకులు శివయ్యస్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ, కలశపూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ, జిల్లాలోని ఆర్యవైశ్యుల సహకారంతో వాసవి అమ్మవారి ఆలయాన్ని ఏడాదిలోగా పూర్తిచేస్తామన్నారు. గత ఏడాది జూన్ 16న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని, ఇప్పటికే అధిక శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. ఎంతో సంప్రదాయబద్ధంగా జరిగిన వాసవి నామశిలల ప్రతిష్ట కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఆర్యవైశ్య దంపతులు పాల్గొనడం సంతోషదాయకమన్నారు. అమ్మవారి ఆలయాన్ని ప్రముఖ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఈ శిలల ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. దాదాపు 10 కోట్ల రూపాయల వ్యయంతో అమ్మవారి ఆలయాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్న జిల్లా ఆర్యవైశ్యుల జీవితాలు ధన్యమన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి నిర్వాహకుడు అయితా రామచంద్రరావు, సుంకు మనోహర్, దొంతంశెట్టి వివేకానందం, సరాబు సుబ్రహ్మణ్యం, పబ్బిశెట్టి శ్రీనివాసులు, కోట సూర్యనారాయణ, సముద్రాల సత్యనారాయణ, పేర్ల రాము, అమరా వెంకు, మింజులూరి శ్రీనివాసులు, చలువాది శరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

బిడ్డలకు ఉన్నత విద్యావకాశాలు, కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. స్వల్పకాలిక ప్రయాణాలుంటాయి. ఉద్యోగ వర్గాలకు అధికారుల సహకారం, మేలు లభిస్తుంది. విలువైన వస్తువులు సమకూరుతాయి. ఆరోగ్యం ఫరవాలేదు. ఆత్మీయులను కలుసుకొంటారు. చేయ దలచుకున్న పనులు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. పెండింగ్‌లో పనులు మరలా ప్రారంభంకాగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగావకాశాలు బాగుంటాయి. అనవసర విషయాలలో జోక్యం వద్దు. ఉద్యోగులకు పని వత్తిడి, అధికారులకు స్థానమార్పు కలదు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఇంటికి నూతన వస్తువులు సమకూరుతాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభిస్తాయి. ఆదాయం బాగుంటుంది. ముఖ్యమైన పత్రాలు, రావలసిన బాకీలు అందుతాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

గృహ రిపేర్లు, వస్తు, వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. ప్రముఖులను, ఆత్మీయులను కలుసుకొంటారు. ఉద్యోగులకు మంచి స్థితి మరియు నిర్వహణ సామర్థ్యముంటుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. ఏదో ఒక రూపంలో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. వృత్తి జీవన సంపాదన బాగుంటుంది. వ్యాపారవర్గాలు అభివృద్ధికై శ్రమ పడాలి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

అధికారులకు అదనపు బాధ్యతలు, స్థాన మార్పులుండగలవు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించే అవకాశం ఉన్నది. కొత్త కాంట్రాక్టులు ఏజన్సీలు లభించగలవు. పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. ఒకటి రెండు వ్యవహారాలలో మిమ్మల్ని విమర్శించే వారు కూడా ఉంటారు. ఆరోగ్యం ఫరవాలేదు. వృత్తి వ్యాపారాలు లాభాలను సమకూరుస్తాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 22.6.2018 నుండి**
**తేది. 28.6.2018 వరకు**

ఈ వారంలో కన్య, తుల, వృశ్చిక, ధనుః రాశులలో చంద్రుడు, మిథునంలో రవిబుధులు, 25తేది నుండి కర్కాటకంలో బుధుడు, కర్కాటకంలో శుక్రరాహువులు, తులలో గురువు, ధనుస్సులో శని, మకరంలో కుజ కేతువులు సంచరిస్తారు.

### పంచాంగము : ముహూర్తములు

తేది 22 శుక్రవారం ఉదయం గంట 9.30 నుండి గంట 10.30లోగా వివాహ వ్యాపారాలు సింహ లగ్నము. తేది 27 బుధవారము ఉదయం గంట 9.30 నుండి 11.30 వరకు వివాహ వ్యాపారాలు సింహ లగ్నము. జ్యేష్ఠ మాసములో శంకుస్థాపనం చేసిన యజమానికి ప్రమాదము. కావున పనికిరాదు.

### నిజ జ్యేష్ఠ మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 22 | శుక్ర | నవమి | ఉ॥ గం.6.54వ॥ |
| తేది. 23 | శని | దశమి | ఉ॥ గం.6.03వ॥ |
| | పిదప | ఏకాదశి | రా॥ గం.5.42వ॥ |
| తేది. 24 | ఆది | ద్వాదశి | రా॥ గం.5.50వ॥ |
| తేది. 25 | సోమ | త్రయోదశి | పూర్తిగ |
| తేది. 26 | మంగళ | త్రయోదశి | ఉ॥ గం.6.30వ॥ |
| తేది. 27 | బుధ | చతుర్దశి | ఉ॥ గం.7.40వ॥ |
| తేది. 28 | గురు | పూర్ణిమ | ఉ॥ గం.9.12వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కొత్త కాంట్రాక్టులు పొందడం, నిర్మాణాలు జరపడం జరుగుతుంది. చేపట్టిన పనులకు మధ్య ఆటంకాలుంటాయి. ఉన్నత విద్యావకాశాలు బాగున్నాయి. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు సమర్థత బాగుంటుంది. చిన్న వృత్తులు వ్యాపారాలు జరుపుకొనేవారికి ఆదాయం బాగుంటుంది. ఇతరులను బాధపెట్టే మాటలు, పనులకు పూనుకోవద్దు. ఆదాయానికి తగిన ఖర్చులుంటాయి.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేయండి. కార్యనిర్వహణ సమర్థత బాగుంటుంది. ఇతరుల విమర్శలను లెక్క చేయకండి. ఉన్నత విద్యావకాశాలు బాగుంటాయి. ఉద్యోగులకు పని భారం ఉంటుంది. ప్రయాణాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థికపరంగా చిక్కులుంటాయి. అయితే డబ్బుకు అంతగా ఇబ్బంది ఉండదు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కుటుంబంలో ముఖ్యంగా స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగులు అధికారులతో సఖ్యతగా ఉంటారు. స్థిరాస్తుల లావాదేవీలకు అవకాశాలుంటాయి. ఉద్యోగార్ధులకు అవకాశాలు లభించగలవు. ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. బంధుమిత్రులకు సహాయపడతారు. ఆరోగ్యం బాగుంటుంది. ప్రవర్తన, మాటలలో దురుసుకు తనం తగ్గించుకోవాలి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అనుకున్న పనులు జరుగుతున్నా టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. నూతన పరిచయాలు, ఆహ్వానాలు అందుకొంటారు. కొన్ని అనవసరపు ఖర్చులు తప్పవు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఉద్యోగార్ధులకు అవకాశాలుండవచ్చును. తొందరపాటు ఎక్కువగా ఉంటుంది. స్థిమితంగా ఆలోచించి నిర్ణయాలు తీసికొనండి. స్థిరాస్తులపై ఆదాయముంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు

పారిశ్రామిక, కాంట్రాక్ట్ రంగాల వారికి ప్రోత్సాహ, అవకాశాలు బాగుంటాయి. విదేశీ ప్రయాణ అనుమతులు పొందడం, కుటుంబసౌఖ్యం, షేర్లలో లాభాలుంటాయి. ముఖ్య నోటీసులు, రశీదులు అందుకొంటారు. ఉద్యోగులు అధికారులతో, పబ్లిక్‌తో తెలివిగా ప్రవర్తించండి. ఆరోగ్యం ఫరవాలేదు. విద్యాప్రగతి బాగుంది. లౌకిక వ్యవహారాలను జాగ్రత్తగా నిర్వహించండి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

రావలసిన బాకీలు నిలబడిపోవచ్చును. సకాలంలో పన్నుల చెల్లింపులుంటాయి. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. అనుకోని ప్రయాణాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధికి అవకాశాలు బాగుండి, ఆదాయం సంతృప్తికరం. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. మాట హామీలు, ఋణాలు ఇవ్వవద్దు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

స్థిరాస్తులపై కొంత రాబడి ఉంటుంది. ఉద్యోగులకు పని భారం వత్తిడి బాగుంటుంది. ఉద్యోగార్ధులు దీక్షతో ప్రయత్నాలు చేయండి. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత బాగుండి బంధువర్గంలో అనారోగ్య వార్తలు వింటారు. కుటుంబ సౌఖ్యం, పిల్లలకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాలలో చిన్న ఇబ్బందులుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ప్రభుత్వ కార్యాలయాలందు పనులు అనుకూలమగును. విద్యార్థులకు మంచి విద్యావకాశాలు దొరుకుట, కుటుంబసౌఖ్యం బాగుండును. వృత్తి వ్యాపారములందు ఆదాయం బాగుంటుంది. ఉద్యోగులకు విధి నిర్వహణ సామర్థ్యముంటుంది. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం బాగుంటుంది. అనుకున్న పనులు వేగవంతంగా సాగుతాయి.

# ట్రంప్, కిమ్‌ల భేటీ వెనుక అదృశ్య శక్తి

శ్రీను గల్పిక

### భేతాళకథ

పట్టువదలని హైటెక్ విక్రమార్కుడు ఎర్లీమార్నింగ్ ఎయిట్ థర్టీకల్లా నిద్ర లేచాడు. అంతకుముందురోజే సెల్ ఫోన్‌లో ప్రధాని మోడీ యోగ విన్యాసాలు చూసి వుండడంతో నిద్రలేవగానే వాటిని ఫాలో అయ్యాడు. ఈ పరంపరలో శీర్షాసనం వేయగా కాళ్ళ సందులో తలకాయ ఇరుక్కుపోయింది. ఆ ఆసనాన్ని ఎలా విప్పాలో తెలియలేదు. ఈలోపు ఎక్కడికక్కడ బిగించినట్లుండడంతో భయంతో కేకలు పెట్టాడు. ఆ కేకలకు హోటల్ సిబ్బంది పరుగునవచ్చి ఆయన కాళ్ళు, చేతుల నుండి తలను విడిపించారు. బుద్ధుంటే వీడియోలు చూసి యోగాసనాలు వేయకూడదనుకున్నాడు. తర్వాత కాలకృత్యాలు ముగించుకుని, మూలాపేట సెంటర్‌లో మటన్ బిర్యాని తిని, మద్రాసు బస్టాండు వద్దకొచ్చి ఆటో ఎక్కి పెద్దాసుపత్రి వద్ద దిగాడు. ఆసుపత్రిలోని మార్చురీ గదిలోకి వెళ్ళి సెల్ లేని శవాన్ని భుజాన వేసుకుని బోడిగాడితోటలోని రోటరీ క్లబ్ శ్మశాన వాటిక వైపు నడవసాగాడు. విక్రమార్కుడు పెద్దాసుపత్రి మెయిన్‌గేటు దాటేలోపలే బాడీలోని భేతాళుడు.. హాఁ ఆర్ యు విక్రమ్ అంటూ పలుకరించాడు. ఆ పలకరింపుకు విక్రమార్కుడు ఆశ్చర్యపోయాడు. అదేంటి భేతాళా ఈరోజు నన్ను ఎక్కువ దూరం నడిపించకుండానే సీన్‌లోకి వచ్చావ్. రోజూ నన్ను మూడు కిలోమీటర్లయినా నడిపించి చెమటలు కక్కించనిదే నీ శాడిజం తగ్గదుకదా... ఈరోజేం, దయతలచావ్ అని అడిగాడు. అందుకు భేతాళుడు... రాత్రి సాకర్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు చూస్తూ అలాగే మేలుకుని వుండిపోయాను. ఇక ఎలాగూ ఇప్పుడు నువ్వొస్తావుకదా అని ఎదురుచూస్తున్నాను. చంద్రబాబు లాంటి ప్రజాసంక్షేమ పాలకుడు రాజ్యాన్ని ఏలుతున్న కాలంలో కూడా నువ్వు పడుతున్న కష్టాన్ని చూస్తుంటే నాకు జాలేస్తుంది. నీకు శ్రమ తెలియకుండా ఉండేందుకు ఇంటర్నేషనల్ స్టోరీ ఒకటి చూపిస్తాను, అలా ఆర్ అండ్ బి బంగ్లాలోకి పద అని చెప్పాడు. ఇద్దరూ ఆర్ అండ్ బి బంగ్లాలోకి వెళ్ళి సోఫాలో కూలబడ్డారు. భేతాళుడు ల్యాప్‌టాప్ తీసి ట్రంప్, కిమ్ మీట్ డాట్ కామ్ వెబ్‌సైట్ ఓపెన్ చేసాడు. స్క్రీన్ మీద సీన్‌లు మొదలయ్యాయి.

★★★★★

అమెరికాలోని శ్వేతసౌధం. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ముందు పెద్ద స్క్రీన్ వుంది. దానిపై ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ వున్నాడు. ట్రంప్ అతని వైపు సీరియస్‌గా చూస్తూ..." కిమ్ నీ పిచ్చి వేషాలు ఇక చాలించు... ఈ ప్రపంచానికి నేనే పెద్దతోపు... నీ అణుపరీక్షలు ఇక ఆపు" అని హెచ్చరించాడు. అవతలవైపు నుండి కిమ్... "ఫూటు జింక ముందు ఊదు... ఈ సింహం ముందు కాదు" అని వ్యంగ్యంగా అన్నాడు. అది విని ట్రంప్ ఆవేశంతో... నాకు తిక్కుంది, దానికో లెక్కుంది అని చెప్పాడు. వెంటనే కిమ్.. నీ తిక్కకు లెక్కున్నా వుంది... నాకు లెక్కలేనంత తిక్కుంది. దాంతో పెట్టుకుంటే నీకే చిక్కు అని అన్నాడు. వెంటనే ట్రంప్.. నేను గట్టిగా తొడ చరిచానంటే ఆ సౌండ్‌కే గుండాగి చస్తావు అని అరిచాడు. అందుకు కిమ్... ఈ తొడలు చరిచే అలవాటు ఎక్కడ నేర్చుకున్నావ్... హీరో బాలకృష్ణను చూసి నేర్చుకున్నావా అని గేలి చేస్తున్నట్లు అన్నాడు. దానికి ట్రంప్‌కు కోపం మోకాళ్లోకి వచ్చి... చూడు నన్ను ఒకవైపే చూడు... రెండో వైపు చూడాలనుకోవద్దు తట్టుకోలేవ్... అంటూ అరిచాడు. అందుకు కిమ్... కత్తులతో కాదు... కంటి చూపుతో నిన్ను, నీ దేశాన్ని నాశనం చేస్తా అని సవాల్ విసిరాడు. దానికి ట్రంప్ చూసుకుందామా... సై చౌడక్కా అని తొడ కొట్టాడు. కిమ్ కూడా సైరా సమరవీరా అంటూ బొటన వేలు చూపాడు. ట్రంప్... కిమ్‌లు వీరావేశంలో వున్న ఫోటోల మీద 'ఇంటర్వెల్' అని అక్షరాలు పడ్డాయి.

భేతాళుడు పార్ట్ సెకండ్ ఫైల్ ఓపెన్ చేయడంతో మళ్ళీ స్క్రీన్ పై సీన్‌లు మొదలయ్యాయి.

★★★★★

అది సింగపూర్‌లోని ఓ హోటల్. ట్రంప్ పూలబొకే చేతిలో పట్టుకుని గేటు బయట నిలుచుని వున్నాడు. అప్పుడే కొన్ని కార్లు వచ్చి ఆగాయి. అందులో నుండి కిమ్ దిగాడు. అప్పుడు బ్యాక్‌గ్రౌండ్‌లో సాంగ్... "ఎన్నాళ్లో వేచిన ఉదయం... ఈనాడే ఎదురవుతుంటే... ఇంకా తెలవారదేమీ... ఈ చీకటి విడిపోదేమీ" అనే పాట రాసాగింది. కారు దిగిన వెంటనే కిమ్ పరుగున వెళ్ళి ట్రంప్‌ను కౌగిలించుకున్నాడు. ట్రంప్ తన చేతిలో బొకేను కిమ్ చేతిలో పెట్టి అలవాటు ప్రకారం బాగా బలిసావు అంటూ పిర్ర మీద కొట్టాడు. తర్వాత లోపలకు వెళ్ళారు. ఇరువురూ శాంతి చర్చలు జరిపారు. మనం మహాత్మాగాంధీ, గౌతమ బుద్ధుడు, జీసెస్ ఆశయాల బాటలో పయనిద్దాం. ఒక చెంపన కొడితే రెండో చెంపను చూపిద్దాం... అని తీర్మానించారు. ప్రపంచ శాంతి కోసం నేను అణ్వస్త్రాలు విసర్జిస్తానని కిమ్ ప్రమాణం చేశాడు. ప్రపంచ శాంతి కోసం నువ్వు చేస్తున్న త్యాగానికి ప్రతిఫలంగా మీ దేశ రక్షణను నేను బాధ్యతగా తీసుకుంటానని ట్రంప్ హామీ ఇచ్చాడు.

ఇక్కడితో సీన్‌లు అయిపోయాయి.

భేతాళుడు లాప్‌టాప్ మూసేసి... రాజా ఇప్పుడు చెప్పు... మొదటి పార్ట్‌లో పరస్పరం ఒకర్నొకరు నరుక్కునేంత కసితో వ్యవహరించిన ట్రంప్, కిమ్‌లు సెకండ్ పార్ట్‌లో అంత శాంతికాముకులుగా ఎలా మారిపోయారు. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయావో పిఆర్‌సి మంజూరైనా చేతికి డబ్బులు రాని ఏపి ఉద్యోగిలా మానసిక క్షోభకు గురవుతావని హెచ్చరించాడు. దానికి విక్రమార్కుడు... వాళ్ళిద్దరి భేటీ వెనుక ఒక అదృశ్య శక్తి వుంది. ఆ శక్తి పేరే హైటెక్‌రత్న చంద్రబాబు. ట్రంప్, కిమ్‌ల రెచ్చగొట్టే ప్రకటనలతో ప్రపంచం ప్రమాదంలో పడుతోందని ఆయన గ్రహించాడు. వాళ్ళిద్దరినీ దారిలో పెట్టాలనుకున్నాడు. అందుకే ఒక వార్నింగ్ పంపాడు. మీరిద్దరూ ఒకరి మీద ఒకరు అణుబాంబులు వేసుకోవడం కాదు... మీరు దారికొచ్చి శాంతి ఒప్పందం చేసుకోకపోతే మీ రెండు దేశాల మీదకు మా ఐఆర్ 20-420 నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలను పంపిస్తా... బ్రతికినంత కాలం ఛస్తూ బ్రతుకుతుంటారు అని హెచ్చరించాడు. ఆ దెబ్బకు భయపడే వాళ్ళిద్దరూ భేటీ అయ్యారు అని చెప్పాడు. ఆ సమాధానానికి సంతృప్తి చెందిన భేతాళుడు బాడీని అక్కడే వదిలేసి 'బార్'కు దూసుకుపోయాడు.



'ఆహా' కథాకుసుమాలను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

# 'ఆహా'.. కథాకుసుమాల ఆవిష్కరణ

నెల్లూరుకు చెందిన ప్రముఖ రచయిత్రి ఘాలి లలిత ప్రవల్లిక రచించిన 'ఆహా!'.. కథాకుసుమాల ఆవిష్కరణ ఇటీవల విజయవాడలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పుస్తకావిష్కరణోత్సవంలో గ్రంథాలయ పరిషత్ ఛైర్మెన్ దాసరి రాజామాస్టారు, సాహిత్యప్రస్థానం సంపాదకులు వోరా ప్రసాద్, ప్రముఖ కవులు కవయిత్రులు కలిమిశ్రీ, చలపాక ప్రకాష్, సోమేపల్లి వెంకటసుబ్బయ్య, హనుమంతురావు, చిన్ని నారాయణరావు, చిల్లర భవానీదేవి, గురుమందరపు హైమావతి, జయప్రకాష్ తదితరులు పాల్గొని రచయిత్రి లలిత ప్రవల్లికను అభినందించారు.

# ఇందిరాభవన్‌లో రాహుల్ బర్త్‌డే





రాహుల్ బర్త్‌డే కేక్‌ను తినిపించుకుంటున్న కాంగ్రెస్ నేతలు

నెల్లూరు ఇందిరాభవన్‌లో 19వ తేదీ ఏఐసిసి అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు సి.వి.శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, టి.బాలసుధాకర్, శీలం తిరుపయ్య, శివాచారి, ఆర్.వి.రమణయ్య, ఫయాజ్ తదితరులు పాల్గొని రాహుల్ బర్త్‌డే కేక్‌ను కట్ చేసుకుని తిన్నారు. కాబోయే ప్రధాని రాహులేనని, కేంద్రంలో అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఈ సందర్భంగా చేవూరు దేవకుమార్‌రెడ్డి ఎంతో ఆత్మవిశ్వాసంతో చెప్పారు.

# పురిటిబిడ్డకు ఆధునిక వైద్యచికిత్స





విలేకర్లకు వివరాలను తెలియజేస్తున్న కిమ్స్ వైద్యులు

నెల్లూరుజిల్లా చేజర్ల మండలం పాడేరు గ్రామ కాపురస్తులు ఉడతా వెంకటేశ్వర్లు, కృష్ణవేణి దంపతులకు రెండవ కాన్పుగా మగబిడ్డ జన్మించాడు. ఆపరేషన్ ద్వారా కాన్పు చేయడం జరిగింది. బిడ్డ పుట్టినప్పుడు కేవలం 600గ్రాముల బరువుతో బలహీనంగా ఉండడంతో బిడ్డ తల్లిదండ్రులు నెల్లూరు కిమ్స్ హాస్పిటల్‌కు తీసుకురాగా చిన్నపిల్లల వైద్య నిపుణులు డా॥ టి.వి.నాగరాజు పరీక్షించి కిమ్స్ హాస్పిటల్‌లో అత్యంత అవసరమైన వైద్యసేవలను అందించడానికి ఎన్‌టిఆర్ వైద్యసేవా పథకం ద్వారా చికిత్స చేసారు. దాంతో 600గ్రాముల బరువున్న బిడ్డ 2కిలోల బరువు వరకు పెరిగి ఆరోగ్యంగా ఉన్నాడు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు మాట్లాడుతూ అధునాతన వైద్యసౌకర్యాలు, అనుభవజ్ఞులైన చిన్నపిల్లల డాక్టర్లు, సిబ్బంది కిమ్స్ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నారని, దీనికొరకు ఇతర పట్టణాల్లోని కార్పొరేట్ హాస్పిటల్స్‌కు వెళ్ళవలసిన అవసరం లేదన్నారు.

# ఎవరెస్ట్ పర్వతారోహణ అమ్మకు అంకితం

ఎవరెస్ట్ పర్వాతారోహణ మా అమ్మకు అంకితమని పర్వతారోహకుడు కోరికల వెంకటసూర్యప్రకాష్ పేర్కొన్నారు.

ఈ నెల 19న నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాలెంలోని డిఎల్‌ఎన్‌ఆర్ ప్రభుత్వ పాఠశాలలో బుచ్చిరెడ్డిపాలెం స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి దేశానికి సేవ చేయాలని, అమ్మానాన్నలకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని కలలు కనేవాడిన న్నారు. నేడు ఆ కలలు కొంతమేరకు నెరవేరాయన్నారు. ప్రపంచంలో 750కోట్ల జనాభాలో ఎవరెస్ట్ ఎక్కింది ఎనిమిదివేల మంది అని, అందులో ఒకడినైనందుకు ఆనందంగా ఉందన్నారు. ఎవరెస్ట్ ఎక్కినప్పుడు పడిన కష్టాలను వివరించారు. ఒక్కొక్కరిపై ప్రభుత్వం రూ.40లక్షలు ఖర్చు చేసిందన్నారు. ప్రాణాలు పణంగా పెట్టి ఎక్కామని, అధిరోహణ సమయంలో 10-15వరకు మృతదేహాలను చూసి భయమేసిందన్నారు. బుచ్చిరెడ్డిపాలెం స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు దేవకుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌లో సూర్యప్రకాష్ చేయబోయే ఈవెంట్లకు తమ క్లబ్ చేయూతనందిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు బద్దెపూడి రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. తహశీల్దార్ రామలింగేశ్వరరావు, ఎంపిడివో సుజాత మాట్లాడారు. సూర్యప్రకాష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి సర్పంచి కె.స్వప్న, అపస్మా జిల్లా ఉపాధ్యక్షులు శ్రీధర్, ఎంఇవో దిలీప్ కుమార్, సిపిడిఓ సుజన సూర్యప్రకాష్ తల్లిదండ్రులు ఆదిశేషమ్మ, శ్రీనివాసులు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, వినయ్ నారాయణ, తాళ్ళ వెంకయ్య పాల్గొన్నారు.



వెంకటసూర్యప్రకాష్‌ను ఘనంగా స్వాగతిస్తున్న గ్రామస్తులు

## ఘన స్వాగతం....

ఎవరెస్ట్ ఎక్కి తొలిసారిగా స్వగ్రామమైన పెనుబల్లికి వచ్చిన సూర్యప్రకాష్‌కు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. పూలమాలలు, బాణాసంచాలతో సందడి చేశారు. అనంతరం బుచ్చిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడనుంచి ముంబయి, చెన్నూరు రోడ్డు మీదుగా భారీ ర్యాలీ చేపట్టారు.

# చింతాళమ్మ పూజలో రాజు



చింతాళమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

వెంకటాచలం మండలం చెముడుగుంటలోని శ్రీ చింతాళమ్మ ఆలయంలో జరిగిన చండీయాగంలో బుధవారం సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ఆయన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# ర్యాంకర్లకు నగదు పారితోషికాలు

నెల్లూరు పొదలకూరురోడ్డులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు జడ్పీ వాకర్స్ ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్షలలో ఫస్ట్ ర్యాంకు సాధించిన బాలికకు రూ.5000/-లు, ద్వితీయ ర్యాంకు సాధించిన ముగ్గురికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు వంతున, తృతీయ ర్యాంకు సాధించిన బాలికకు రూ.2,000/-లు అందజేశారు. ఈ నెల 17న జడ్పీ వాకర్స్ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు కోడూరు రంగారావు, మాజీ అధ్యక్షులు చెలికాని సీతారామయ్య ఈ ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం హైస్కూలు ఆవరణంలో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమంలో చిన్నారుల నృత్యప్రదర్శనలు, వేదాంతం హర్షవర్ధనీ



విద్యార్థినికి పారితోషకాన్నందజేస్తున్న జడ్పీ వాకర్స్ సభ్యులు

ప్రసాద్, వి.ఆంజనేయులు గాత్రం, జడ్పీ వాకర్స్ మహిళా సభ్యులచే "నడక-నడత" అనే లఘు నాటిక(జెయస్‌ఆర్ ఆంజనేయులు రచన దర్శకత్వంలో) ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, శ్యామల శ్రీనివాసరెడ్డి, ఆకి రామకృష్ణ, యం.వి.సుబ్బారెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, పి.పట్టాభిరామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయని బి.లక్ష్మీప్రసన్న, బిరుదవోలు రామిరెడ్డి, బియస్ ప్రసాద్, వి.చెంచయ్య, జెఎస్‌ఆర్ ఆంజనేయులు, వడపల్లి ఆంజనేయులు, కె.శ్రీనివాసులు, ఎం.వాసు, దేవయ్య పాల్గొన్నారు. చలంచర్ల భాస్కర్‌రెడ్డి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మెట్టు సుధాకరరెడ్డి, సుజన దంపతులను ఆదర్శదంపతులుగా సత్కరించారు.

# హౌసింగ్‌బోర్డు వాకర్స్ అసోసియేషన్





స్థానిక ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న నెల్లూరు నగరంలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వాకర్స్ సంస్థ అధ్యక్షుడు కె.రంగరావు, మాజీ అధ్యక్షుడు చెలికాని సీతారామయ్య, ఏరియా-2 ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి, మైథిలి మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. నూతన అసోసియేషన్‌కు అధ్యక్షునిగా ఎన్.నారాయణరావు, కార్యదర్శిగా బి.రమణయ్య, కోశాధికారిగా వై.జగదీష్‌లతో పాటు, మరికొంతమంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు నలుబోలు బలరామయ్యనాయుడు, వినుకొండ వెంకటేశ్వర్లు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు నిత్యావసర సరుకులు

కావలి పట్టణంలోని సంయుక్త సేవాసంస్థ ద్వారా ఈనెల 16న 15మంది నిరుపేద కుటుంబాలవారికి నిత్యావసర సరుకులను పంపిణీచేశారు. శాశ్వత దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామని ఆ సంస్థ అధ్యక్షుడు జి.సురేంద్ర తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ శాశ్వత దాతలు గంధం ప్రసన్నాంజనేయులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జాఫర్‌ఖాన్, ఎల్‌ఇఆర్ లీలావతి, హిందీ ఉపాధ్యాయిని లక్ష్మీప్రసన్న, కానిస్టేబుల్ అయోధ్య, సూరి సుధాకర్, వి. నరసింహం, ఎస్‌కె అప్టస్, శ్రీను, భాస్కరరెడ్డి, శ్రీచైతన్యకాలేజీ అధ్యాపకుడు అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ గౌరవాధ్యక్షులుగా గంధం ప్రసన్నాంజనేయులను, గౌరవ ఉపాధ్యక్షులుగా జాఫర్‌ఖాన్‌ను, ఉపాధ్యక్షులుగా సూరి సుధాకర్‌ను ఎన్నుకున్నారు.

# కందలపాడు స్కూలుకు బీరువా బహుకరణ

ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యుడు టి.శరత్‌బాబు తల్లిదండ్రుల 48వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 17న వెంకటాచలం మండలం కందలపాడు గ్రామంలోని మండల ప్రజాపరిషత్ స్కూలుకు స్టీలు బీరువాను ముఖ్యఅతిథుల చేతులమీదుగా అందజేశారు. ముఖ్యఅతిథులుగా అంతర్జాతీయ వాకర్స్ సంస్థ అధ్యక్షులు కొండూరి రంగారావు, మాజీఅధ్యక్షులు చెలికాని సీతారామయ్య, ఆకి రామకృష్ణ, శ్యామల శ్రీనివాసులురెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి, పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి పాల్గొన్నారు. అలాగే గీతామయి వృద్ధుల ఆశ్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు చేతుల మీదుగా రూ.3000/- విరాళం అందించారు. అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు, ఉపాధ్యక్షులు జి.వి.కృష్ణయ్య, సాయి సుబ్బారావు, దొడ్ల జయరామానాయుడు, లక్కాకుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ముత్తుకూరు తహశీల్దార్‌గా సుధాకర్

ముత్తుకూరు తహశీల్దార్‌గా కలెక్టరేట్ భూ పరిపాలనా విభాగంలో పని చేస్తున్న పి.వి.సుధాకర్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు ఉత్తర్వులు జారీ చేసారు. ఇటీవల రెవెన్యూలో చేపట్టిన భారీ బదిలీలలో భాగంగానే తహశీల్దార్‌గా సుధాకర్ నియమాకం జరిగింది.

# ఆదర్శనేత.. దేగా నారసింహారెడ్డి కన్నుమూత



నిజాయితీ రాజకీయానికి నిలువెత్తు నిదర్శనం, విలువలతో కూడిన వ్యక్తిత్వానికి ప్రతిరూపం, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మెన్ దేగా నారసింహారెడ్డి ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం స్వర్గస్థులయ్యారు. ఆయన వయసు 82సంవత్సరాలు. గత కొన్నేళ్ళుగా రాజకీయాలకు దూరంగా వుంటున్న ఆయన అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

కాంట్రాక్టర్‌గానూ, రాజకీయ నాయకుడిగానూ దేగా నారసింహారెడ్డిది విశిష్టమైన పాత్ర. పొదలకూరు మండలంలోని లింగంపల్లి ఆయన ఊరు. పొదలకూరు సమితి అధ్యక్షుడిగా ఆయన రాజకీయ పయనం మొదలైంది. 1978లో రాపూరు అసెంబ్లీ నుండి జనతా పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పుడు ఆ పార్టీలో చేరి ఎన్టీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ముద్రపడ్డాడు. ఎన్టీఆర్ సమితులను ఎత్తేసి మండల వ్యవస్థను తెచ్చాక 1987లో జిల్లా ప్రజా పరిషత్‌లకు, మండల ప్రజాపరిషత్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎన్నికల్లో నెల్లూరుజిల్లా ప్రజాపరిషత్ నుండి తెలుగుదేశం పార్టీ ఛైర్మెన్ అభ్యర్థిగా పోటీ చేసిన దేగా నారసింహారెడ్డి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి జె.కె.రెడ్డిపై దాదాపు 68,726 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నెల్లూరు జడ్పీ ఛైర్మెన్‌గా తన పనితీరుతో నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తర్వాత అంతటి మంచిపేరు తెచ్చుకున్నది నారసింహారెడ్డే! జడ్పీ ఛైర్మెన్‌గా నీతివంతమైన పాలన అందించారు. ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 1991లో లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఆయన ఒంగోలు లోక్‌సభ స్థానం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసారు. అప్పుడే రాజకీయారంగేట్రం చేసిన కాంగ్రెస్ అభ్యర్థి మాగుంట సుబ్బరామిరెడ్డి చేతిలో దాదాపు 30వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఎన్టీఆర్ హయాంలోనే ఆయన ఏపి అర్బన్ హౌసింగ్ బోర్డు ఛైర్మెన్‌గా పని చేశారు. 1994లో సర్వేపల్లి నుండి పోటీ చేయాలనుకున్నా టిక్కెట్ దక్కలేదు. 1994-95ల మధ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1999లో ఆయన తెలుగుదేశాన్ని వీడి బీజేపీలో చేరారు. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో నెల్లూరు అసెంబ్లీ నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఆనం వివేకానందరెడ్డి చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా వుంటూ వచ్చారు.

దేగాకు ఎన్టీఆర్ కుటుంబసభ్యులతో పాటు దివంగత సీఎంలు వై.యస్.రాజశేఖరరెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిలతో సన్నిహిత సంబంధాలుండేవి. 1993లో కోవూరుకు ఉపఎన్నికలు జరిగినప్పుడు అప్పుడు టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించిన చంద్రబాబునాయుడు నెల్లూరు, రామ్మూర్తి నగర్‌లోని దేగా నారసింహారెడ్డి ఇంట్లోనే బస చేసారు. వివాద రహితుడిగా పేరు తెచ్చుకున్న దేగా నరసింహారెడ్డికి ఎవరితోనూ శత్రుత్వం వుండేది కాదు. నెల్లూరులో ఆ కాలంలోనే ఎంతో కళాత్మకంగా నిర్మించిన రాధ, మాధవ్ థియేటర్‌లలో ఆయన భాగస్వామి కూడా! రాజకీయ నేతగానే కాక పేరుమోసిన కాంట్రాక్టర్‌గా కూడా ఆయన రాణించారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# పచ్చ మీడియా రచ్చతో... బాబుకు మచ్చ

(మొదటి పేజీ తరువాయి)

జైలుశిక్ష వేసారు. పోలీసులు అతనిని జైలుకు తీసుకెళ్ళే ముందు తన తల్లిని చూడాలని కోరాడు. పోలీసులు అతని తల్లిని పిలిపించారు. ఆమెతో ప్రేమగా మాట్లాడుతాడేమో అనుకుంటుండగా ఆ కొడుకు తన తల్లి చెంపమీద లాగికొట్టాడు. పోలీసులు నిర్ఘాంతపోయి, నీ తల్లిని ఎందుకు కొట్టావు, ఆమె ఏం తప్పు చేసిందని అడిగారు. అప్పుడా కొడుకు... నేను ఈ రోజు జైలుకెళ్ళడానికి కారణం నా తల్లే. నేను తోటకూర దొంగతనం చేసినప్పుడే ఇది తప్పు, ఇలా చేయకూడదు అని మందలించి వుంటే ఈరోజు నేను దొంగగా కాకుండా మంచిపౌరుడిగా వుండేవాడిని అని చెప్పాడు.

ఇప్పుడు ఈ కథను ఎవరికి అన్వయిద్దాం... పచ్చమీడియాకు, చంద్రబాబుకు సరిగ్గా సరిపోతుంది. 2014 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి రాకపోవడానికి చాలా కారణాలున్నాయి. అందులో ఒకటి జగన్ సొంత మీడియా కూడా! గాలివాటం సర్వేలు నిర్వహించి నూటపాతిక, నూట ముప్పై సీట్లు అంటూ ఊదరగొట్టారు. గుంటూరు నుండి శ్రీకాకుళం దాకా ఆ జిల్లాల్లో ఏం జరుగుతుంది, కుల సమీకరణలు ఏ విధంగా జరుగుతున్నాయన్నది అంచనా వేయకుండా గాలిలో మేడలు కట్టారు. జగన్ మీడియా లెక్కలు చూసి వైసిపి కేడర్ కూడా ఇంట్లో కూర్చున్నా గెలిచిపోతామనే భ్రమలో పడింది. క్షేత్రస్థాయిలో చేయాల్సిన పనిని వదిలేసారు. కాబట్టి వైసిపి ఓడిపోయింది.

మరిప్పుడు పచ్చమీడియా కూడా తోటకూర దొంగతనం కథలోని తల్లి పాత్రనే పోషిస్తోంది. చంద్రబాబు పాలనలోని లోపాలను ఎత్తి చూపుతూ పరిపాలనను సక్రమమైన దారిలో పెట్టించాల్సిన పచ్చమీడియా ఆయన ఏ ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నా తంధానా అంటూ చివరకు చంద్రబాబు చాప క్రిందకే నీళ్ళు తెస్తుంది.

మొన్న ఢిల్లీలో నీతి అయోగ్ సమావేశం జరిగింది. దేశంలోని ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు సమావేశానికి వస్తారు. ఇది ఆనవాయితీ. వచ్చిన వీరందరూ ప్రధానిని కలవడం, అభివాదం చేయడం మామూలే! నాయకుల మధ్య సైద్ధాంతిక పరమైన వైరం ఉంటుందేగాని వ్యక్తిగత వైరం ఉండదు కదా! కాని మొన్నటి నీతిఅయోగ్ సమావేశంలో చంద్రబాబు ఒక్కడి పాత్రే పెద్ద చర్చనీయాంశమైంది. మోడీ ముందు చంద్రబాబు 75డిగ్రీల కోణంలో వంగాడని, ఆయన ఎడమ చేత్తో చంద్రబాబుకు షేక్‌హ్యాండిచ్చాడని మీడియాలో ఒకటే రచ్చ. చంద్రబాబుకు చేయి ఇచ్చింది ఎవరినేదానిపై కూడా ఒక పచ్చ ఛానెల్‌లో ప్రత్యేక చర్చ పెట్టారు. అసలు 'నీతి అయోగ్' సమావేశంలో ఏం జరిగిందనే దానిపై ఇంత రచ్చ ఎందుకంటే దానికి కారణం చంద్రబాబుకు క్షణక్షణం బ్యాండ్ మేళం వాయించే ఒక మీడియానే! నీతి అయోగ్ సమావేశానికి ముందు రోజే ఈ పచ్చ పత్రికలలో, ఛానెల్స్‌లో చంద్రబాబు ఢిల్లీ వెళుతున్నాడని, ఇక ఢిల్లీతో సమరమేనని, కత్తులతో కాదు కంటి చూపుతో కమలనాథుల ఫ్యాంట్లు తడిపేస్తాడని ఊదరగొట్టారు. నీతిఅయోగ్ సమావేశానికి, వీళ్ళు ప్రసారం చేసిన 'సమరసింహారెడ్డి' లాంటి సినిమాకు ఎలాంటి సంబంధం లేదు. కాని పక్కరోజు ఆయన మోడీ ముందు బెండ్ అయిన ఫోటో బయటకు రావడంతో 'ఇదేనా సమరం' చేయడం అంటే అంటూ సోషల్ మీడియాలో తాట వలిచారు. ఏతావాతా ఆ మీడియా కథనానికి భంగపడింది చంద్రబాబే!

ఈ ఒక్కటే కాదు... మొదటి నుండి ఈ పచ్చమీడియా బాబు అనుకూల శత్రువుగానే వ్యవహరిస్తోంది. 35వేల ఎకరాల మాగాణి భూములను నాశనం చేసి సింగపూర్ లాంటి రాజధానిని కడతామన్నప్పుడు... ఇది పద్ధతి కాదు బాబు, పంటలు పండే పొలాలను నాశనం చేయొద్దు అని ఈ పచ్చమీడియా హెచ్చరించి వుంటే ఈరోజు రాజధాని రైతుల్లో చంద్రబాబుపై వ్యతిరేకత వుండేది కాదు. పుష్కరాలకు ఇన్ని వేల కోట్లు తగలేయకూడదు అని చెప్పివుంటే రాష్ట్రంతో పాటు చంద్రబాబుకు మేలు చేసినవాళ్ళై వుండేవారు. పోలవరం ప్రాజెక్ట్ అంచనాలు అంతగా ఎందుకు పెరిగాయని నిలదీసి వుంటే ఈరోజు కేంద్రం దృష్టిలో చంద్రబాబు అవినీతి పరుడై వుండేవాడు కాదు. తహశీల్దార్ వనజాక్షిని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఇసుకలో ఈడ్చి కొట్టినప్పుడు ఇది తప్పు... ఎమ్మెల్యేపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాసుంటే చంద్రబాబుకు మంచి చేసినవాళ్ళై వుండేవారు. వైసిపికి చెందిన మొదటి ఎమ్మెల్యేను కొన్నప్పుడే ప్రజాస్వామ్యంలో ఇది పద్ధతి కాదు బాబూ అని పచ్చ మీడియా హితోపదేశం చేసుంటే ఆయన 23మంది ఎమ్మెల్యేలను కొనేదాకా పరిస్థితి వచ్చేది కాదు. ఇలా చంద్రబాబు చేసుకుంటూ వచ్చిన ఎన్నో తప్పులకు పచ్చ మీడియా వంతపాడడమే కాదు, ఆహో... ఓహో అద్భుతం అంటూ భజన చేసింది. చంద్రబాబు చేత తప్పుల మీద తప్పులు చేయించింది. రేపు ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోతే... అందులో సగానికిపైగా పాత్ర ఈ పచ్చమీడియాదే!

# ఎవర్ని ముంచుతారో?

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీకో లేదా టీడీపీకో పనిచేసే అవకాశముంది. లేదంటే పవన్‌కు తోడుగా జతకావచ్చు కూడా! గత ఎన్నికలకు రేపటి ఎన్నికలకు తేడా ఇదే! 2014 ఎన్నికల్లో పొత్తులో భాగంగా టీడీపీకి పడ్డ బీజేపీ ఓట్లను ఈసారి ఆ పార్టీ చీల్చుకోవచ్చు. ఈ రూపంలో నష్టం ఎంతుండొచ్చో అప్పుడే చెప్పలేం. మరి లక్ష్మీనారాయణ, పవన్‌కళ్యాణ్‌లు ఎవరిని ముంచడానికి సిద్ధంగా వున్నారో తేలాల్సివుంది. లక్ష్మీనారాయణ ఏ పార్టీలో చేరినా, ఏ పార్టీకి ప్రచారం చేసినా వైసిపికి వచ్చే నష్టం ఏమీ లేదు. జగన్ వ్యతిరేకులే లక్ష్మీనారాయణ అభిమానులవుతారు. ఆయన ఇంకా జనసేనకో, బీజేపీకో మద్దతునిస్తే ఎంతో కొంత తెలుగుదేశంకే నష్టం. 2014లో పవన్‌కళ్యాణ్ ఓటు తెలుగుదేశానికే పడింది. కాబట్టే ఉభయగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో తెలుగుదేశం భారీగా సీట్లు సాధించి అధికారంలోకి రాగలిగింది. ఈసారి ఎన్నికల్లో జనసేన సొంతంగానే పోటీ చేయబోతోంది. మరి పవన్‌కళ్యాణ్ ఓట్లు తెలుగుదేశం, జనసేనల మధ్య చీలితే ఎవరికి నష్టం? పవన్ వల్ల జగన్‌కు కొత్తగా వచ్చే నష్టమేమీ లేదు. వచ్చే ఎన్నికల్లో కూడా పవన్ టీడీపీకే మద్దతునిస్తే వైసిపికి నష్టం. పవన్ విడిగా పోటీ చేస్తే వైసిపికి కొంత లాభం. అసలు వైసిపికే మద్దతునిస్తే తెలుగుదేశాన్ని సులభంగా పడగొట్టొచ్చు. మొత్తంమ్మీద వీళ్ళిద్దరి వల్ల ఎవరికి మూడనుందో చూడాలి!

# ముందస్తుకు.. ముహూర్తం?

(మొదటి పేజీ తరువాయి)

ఆచరణలోకి తెచ్చే అవకాశం ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం చేతుల్లోవుంది. ఈ ఏడాది ఆఖర్లో దాదాపు 5రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి వుంది. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో మరో 5రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలతో పాటూ లోక్‌సభకు ఎన్నికలు నిర్వహించాలి. ఈ ఏడాది ఆఖర్లో నిర్వహించాల్సిన 5రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను వాయిదా వేయలేరు, గడువు ప్రకారం నిర్వహించాల్సిందే! కేంద్రం తలచుకుంటే లోక్‌సభకు కూడా ఈ రాష్ట్రాలతో పాటే సార్వత్రిక ఎన్నికలకు పోవచ్చు. కాని దీనివల్ల పెద్దగా ఉపయోగం లేదు. ఎందుకంటే వచ్చే ఏడాది ప్రథమార్ధంలో మరో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటే లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయి కాబట్టి! అలాకాకుండా ఈ ఐదు రాష్ట్రాలలోని ప్రభుత్వాలను కూడా ముందస్తు ఎన్నికలకు ఒప్పించగలిగితే ఎన్డీఏ పెద్దల 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' ఆశయం పాక్షికంగానైనా నెరవేరినట్లవుతుంది. ఇలా రెండు మూడు దఫాల ప్రక్రియ ముగిసాక దేశమంతటా కూడా ఒకేసారి లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరిపే పరిస్థితి వస్తుంది.

ఈ ప్రక్రియకు ఇప్పటి నుండే అంకురార్పణ చేయాలని బీజేపీ అగ్ర నాయకత్వం ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరపాలనుకుంటున్న రాష్ట్రాలలో కూడా ఎక్కువ రాష్ట్రాలు బీజేపీకి కీలకమైనవే! జాతీయ పరిస్థితులను కేంద్రంగా చేసుకునే బీజేపీ ముందస్తు ఎన్నికలకు వ్యూహం పన్నుతున్నట్లు తెలుస్తోంది. ముందస్తు ఎన్నికలకు వెళ్ళాలంటే నోట్ల రద్దు, జిఎస్టీ, పెట్రోల్ ధరలు బీజేపీకి ప్రతికూల అంశాలు. ఎన్నికలనాటికి నోట్ల రద్దు ప్రభావం పెద్దగా వుండకపోవచ్చు. జిఎస్టీ వల్ల ఉపయోగాలు ఇప్పుడిప్పుడే తెలుస్తున్నాయి. పెట్రోల్ ధరల విషయంలోనే బీజేపీపై వ్యతిరేకత ఎక్కువుగా వుంది. అయితే దీనిని జిఎస్టీ పరిధిలోకి తేవడం లేదా తన పరిధిలో ధరలు తగ్గించడం పెద్ద సమస్య కాదు.

ఇక అనుకూల అంశాలను తీసుకుంటే ఒక్క అవినీతి కుంభకోణం లేని పాలన అందించారు. ప్రభుత్వంలో అవినీతి తగ్గింది. జిఎస్టీతో దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారు. ఈ ప్రభుత్వం విదేశాల నుండి ఒక్క రూపాయి అప్పు తేలేదు. మోడీ విదేశాంగ విధానంతో ప్రపంచంలోనే భారత్‌కు ఎనలేని గుర్తింపు వచ్చింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాద దాడులను చాలావరకు అరికట్టగలిగారు. ఇక ఈ నాలుగేళ్ళలో దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశారు. విద్యుత్, రవాణా, రైల్వే వ్యవస్థలు మెరుగుపడ్డాయి. జమ్మూ, కాశ్మీర్‌లో ఉగ్రచర్యలపై ఇక ఉక్కుపాదం మోపే ప్రక్రియకు కూడా శ్రీకారం చుట్టారు. మొత్తంగా చూస్తే మరోసారి ప్రజల్లో జాతీయతా భావాలను ప్రేరేపించే విధంగా బీజేపీ ముందస్తు ఎన్నికలకు సిద్ధమవుతుంది. లోక్‌సభతో పాటు దేశంలోని మూడొంతుల్లో ఒక వంతు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలన్న బీజేపీ నాయకత్వం ప్రయత్నాలు సఫలమైతే మన తెలుగురాష్ట్రాలకు కూడా ముందస్తు ఎన్నికలు తప్పవేమో!



## ఆదాల చుట్టూ...
# చక్కర్లుకొడుతున్న రాజకీయం

***ప్రస్తుతం జిల్లా తెలుగుదేశం పార్టీలో వున్న బలమైన నాయకులలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఒకడు. రెండు, మూడు అసెంబ్లీలలో తన ప్రభావం చూపగలిగిన నాయకుడు. కాబట్టే ఇప్పుడు తెలుగుదేశం రాజకీయం అంతా ఆయన చుట్టూ తిరుగుతోంది. ఆయనను పార్టీ వదిలి పోకుండా కట్టడి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.***

టీడీపీలో వున్న బలమైన నాయకుడు ఆనం రామనారాయణరెడ్డి పార్టీని వదిలి వైసిపిలో చేరాలనే నిర్ణయానికి వచ్చేసాడు. ఈ నిర్ణయంతో పార్టీకి చాలావరకు నష్టమే! ఆదాల ప్రభాకర్‌రెడ్డి మీద కూడా చాలా రోజుల నుండి అలాంటి అనుమానాలే వున్నాయి. ఎన్నికల నాటికి పార్టీ మారుతాడనే వూహాగానాలున్నాయి. ఆయన మనసులోకి ఆ ఆలోచనలు రాకుండా చేసేందుకు తెలుగుదేశం నాయకత్వం ఆయనకు పెద్దపీట వేస్తోంది.

2014లోనే ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరివుండాలి. కాని, చివరి నిముషంలో మేకపాటి కుటుంబ సభ్యులు మూడు టిక్కెట్లకు పోటీ చేస్తామనడంతో ఆయనకు వైసిపిలో అవకాశం లేక తెలుగుదేశంలో చేరాడు. నెల్లూరు లోక్‌సభ నుండి పోటీ చేసాడు. వైసిపి అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డికి గట్టి పోటీనిచ్చి కేవలం 13వేల ఓట్ల తేడాతో ఓడిపోయాడు. ఆ ఎన్నికల్లో జిల్లాలో వైసిపి ప్రభంజనం బలంగానే పనిచేసింది. కాని లోక్‌సభకొచ్చేసరికి ఆ పార్టీ మెజార్టీ బాగా తగ్గిపోయింది. 2012 ఉపఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుండి దాదాపు 3లక్షల మెజార్టీతో గెలిచిన వైసిపి అభ్యర్థి 2014 ఎన్నికల్లో 13వేలతో బయటపడ్డాడు. ఆ ఎన్నికలలో సిటింగ్ ఎంపీగా మేకపాటిపై వున్న వ్యతిరేకతతో పాటూ వ్యక్తిగా లోక్‌సభ పరిధిలోని నెల్లూరు, కోవూరు, కావలి, నెల్లూరురూరల్ ప్రజలతో ఆదాలకు వున్న సంబంధాలు వైసిపి ఎంపీ అభ్యర్థి ఓట్లకు కోత పెట్టాయి. టీడీపీ అభ్యర్థి ఆదాల కాబట్టే భారీగా క్రాస్‌ఓటింగ్ జరిగింది.

అప్పటి ఎన్నికల తరహాలోనే ఇప్పుడు కూడా ఆదాలను టీడీపీ నాయకులు అంచనా వేస్తున్నట్లుగా వుంది. 2014 ఎన్నికల్లో పార్టీలు, పార్టీ అధినేతలనే కాకుండా అభ్యర్థులను కూడా పరిగణనలోకి తీసుకుని ఓట్లేసారు. కాని, రేపొచ్చే ఎన్నికల్లో అలా వుండదు. ప్రభుత్వంపై అనుకూలమా లేక వ్యతిరేకమా అనేదే ప్రభావం చూపబోతోంది. తెలుగుదేశం ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వుంది. ఈసారి ఎన్నికల్లో 2014 మాదిరిగా క్రాస్ ఓటింగ్ జరిగే పరిస్థితి లేదు. అసెంబ్లీకి ఏ గుర్తు మీద నొక్కుతారో లోక్‌సభకూ అదే గుర్తు మీద నొక్కుతారు. భారీస్థాయి క్రాస్ ఓటింగ్‌కు ఆస్కారమే లేదు. రేపు ఆదాల ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు లోక్‌సభ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసినా ఇదే పరిస్థితి. ఈసారి ఆయన కోసంగా ఓటును క్రాస్ చేసే అవకాశాలు లేవు. తెలుగుదేశం నుండి ఆయన లోక్‌సభకు పోటీ చేసినా లేదా అసెంబ్లీకి పోటీ చేసినా సమరం క్లిష్టంగానే వుంటుంది. అదీగాక ఈసారి సిటింగ్ ఎంపీ మేకపాటిపై ప్రజల్లో అంత వ్యతిరేకత కూడా లేదు. ఆదాల ఏ నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసినా గెలుపు కోసం చెమటలు కక్కాల్సిందే! అయినా కూడా గ్యారంటీ వుండదు. కాని అదే ఆదాల వైసిపి నుండి లోక్‌సభకు పోటీ చేసినా, అసెంబ్లీ నుండి దిగినా గెలుపుకు అవకాశాలెక్కువ.

ఇక్కడ ఒకటే లాజిక్కు... ఆదాల తెలుగుదేశంలోనే వుంటే అది ఎంతో కొంత పార్టీకి లాభం... ఆయనకు నష్టం. అదే వైసిపిలో చేరితే పార్టీతో పాటు ఆయనకూ లాభమే!

## కాల్ చేస్తే...
# మీ ఇంటి కాలింగ్ బెల్ కొడతా!



మోహన్‌బాబుకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఏ ప్రాంతంలోని వారైనా సమస్యలపై తనకు ఫోన్ చేస్తే, వారింటిముందుంటానని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 366రోజుల ప్రజాప్రస్థానంలో భాగంగా ఆయన ఈ నెల 19న 35వ డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో పర్యటిస్తూ స్థానిక ప్రజలను పేరుపేరునా పలుకరించారు. ఈ సందర్భంగా ఆయన తన దృష్టికి వచ్చిన సమస్యలపై అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని కోరారు. అలాగే స్థానికంగా పదవ తరగతిలో 10కి 10 జిపిఏ సాధించిన టి.మోహన్‌బాబు అనే విద్యార్థికి ఆయన నగదు ప్రోత్సాహాన్ని అందించి శాలువాతో సత్కరించారు.

# పోలీసుల యోగా



జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఆదేశాల మేరకు ఈ నెల 21వ తేదీ నెల్లూరు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏఆర్ డిఎస్పీ చంద్రశేఖర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎప్పుడూ బిజీగా వుండే పోలీసులపై మానసిక ఒత్తిడి ఎక్కువగా వుంటుందని, దీనిని అధిగమించేందుకు ప్రతిఒక్కరూ యోగాను తమ జీవన విధానంలో ఓ భాగంగా చేసుకోవాలన్నారు. యోగా వలన ఆరోగ్యం, మానసిక ధైర్యం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పోలీసు యోగా మాస్టర్ ఎ.మురళీకృష్ణ యోగా ప్రక్రియను వివరిస్తూ... యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు చంద్రమోహన్, రమేష్‌కృష్ణ, మౌలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యోష్ణవిని సత్కరించిన సీఎం




నెల్లూరుకు చెందిన అంతర్జాతీయ యోగా క్రీడాకారిణి ఏకాంబరం జ్యోష్ణవిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సత్కరించారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ వేడుకలకు జ్యోష్ణవిని ప్రత్యేకంగా ఆహ్వానించడమేకాక ఆమె చేతనే జ్యోతిప్రజ్వలన చేయించారు. ఈ సందర్భంగా ఇటీవలే అర్జెంటీనాలో జరిగిన అంతర్జాతీయ యోగా పోటీలలో 2 బంగారు పతకాలు సాధించినందుకుగాను జ్యోష్ణవిని సీఎం సత్కరించారు.

# అనుచరుల నోట.. జగన్ బాట!



- ఆత్మీయ సమావేశం తర్వాతే ఆనం అడుగు
- జూలై 8న ముహూర్తం కుదిరే అవకాశం?

తనను, తన అన్నను మోసం చేసిన తెలుగుదేశంకు గుడ్‌బై చెప్పాలని మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిర్ణయించుకోవడం తెలిసిందే! అయితే ఆయన ఏకపక్షంగా పార్టీ మారాలన్న నిర్ణయం తీసుకోలేదుగా! ఇంతకాలం తనతో కలసివచ్చిన అనుచరులతోనూ సంప్రదింపులు జరిపాకే నిర్ణయం తీసుకోవాలనుకున్నాడు. ఆనం అనుచరులు కేవలం ఆత్మకూరులోనో, నెల్లూరులోనో మాత్రమే లేరు. ఉదయగిరి నుండి సూళ్ళూరుపేట దాకా అన్ని నియోజవర్గాలలోనూ వున్నారు. కాబట్టే ఆయన గత కొన్నిరోజులుగా జిల్లా వ్యాప్తంగా వున్న తన అనుచరులను పిలిపించుకుని మాట్లాడుతున్నాడు. తెలుగుదేశంలో తమకెదురైన పరిస్థితులను వివరిస్తున్నాడు. కాని ఆయనకంటే ముందే ఆయన అనుచరులు జై జగన్ అంటున్నారు. తెలుగుదేశం వీడడానికి, వైసిపిలో చేరడానికి సంసిద్ధమంటున్నారు. ఆనం అనుచరులలో చాలా తక్కువమంది మాత్రమే టీడీపీని వీడాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఆత్మకూరు నియోజకవర్గంలో మెజార్టీ అనుచరుల అభిప్రాయం వైసిపిలో చేరాలనే! అనుచరుల అభిప్రాయ సేకరణ అనే మర్యాదపూర్వక ప్రక్రియ దాదాపు పూర్తికావొచ్చినట్లు తెలుస్తోంది. ఇక టీడీపీకి రాజీనామా లేఖ టైప్ చేయడం మిగిలింది. అన్నీ కుదిరితే వై.యస్. జయంతి రోజైన జూలై 8వ తేదీ ఆయన వైసిపిలో చేరొచ్చని తెలుస్తోంది!




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com